


జిల్లా స్థాయి స్పందనకు 163 అర్జీలు


రాజమహేంద్రవరం రూరల్ /సిటీ మార్చి 4: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత నిర్వహించిన స్పందనలో పలు మండలాల నుంచి ప్రజలు వచ్చి 163 అర్జీలు అందించారు.ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్ అర్జీలు స్వీకరించారు. ఆన్‌లైన్‌లో 151, ఆఫ్‌లైన్‌లో 12 ఆర్జీలు స్వీకరించామని తెలిపారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

నువ్వక్కడ.. నేనిక్కడ!

- నిడదవోలుకు కందుల దుర్గేష్..?
- రాజమహేంద్రవరం రూరల్‌కు గోరంట్ల?
- రాజమహేంద్రవరం ఎంపీగా బీవీఆర్ చౌదరి?
- నిడదవోలులో బుజ్జగింపు బాధ్యత అధిష్ఠానందే
- అధికారిక ప్రకటనే తరువాయి


బీవీఆర్ చౌదరి


దుర్గేష్


గోరంట్ల

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం రూరల్ సీటు విషయంలో ఒక స్పష్టత వచ్చినట్టు సమాచారం. అయితే అధికారిక ప్రకటన చేయడమే తరువాయి. టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాలో రూరల్ సీటు ప్రకటించని సంగతి తెలిసిందే.కానీ ఈ సీటును సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికే ఖాయం చేశారని.. జనసేన నేత కందుల దుర్గేష్‌ను నిడదవోలు నుంచి పోటీ చేయిస్తారని విస్తృతంగా ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. తొలి జాబితా ప్రకటన రోజున టీడీపీ అధినేత చంద్రబాబును కలిసిన విలేకరులు రాజమహేంద్రవరం రూరల్ సీటు విషయం ప్రస్తావన తేవగా గోరంట్ల, కందుల దుర్గేష్ ఇద్దరికీ పోటీ చేసే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.తర్వాత జనసేన అధిష్ఠానం నిడదవోలు నుంచి దుర్గేష్ పోటీ చేస్తే బాగుంటుందని సూచించింది. దీనిపై ఆయన తన వైఖరిని స్పష్టం చేయలేదు.ఈ నేపథ్యంలో దుర్గేష్‌ను రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థిగా ప్రకటించాలని జనసేన కేడర్ ఆందోళనలు చేసింది. ఇదిలా ఉండగా సోమవారం ఈ సీటు విషయం అధికారికంగా తేల్చేసినట్టు సమాచారం. నిడదవోలు నుంచి కందుల దుర్గేష్ పోటీకి సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది.ఈ మేరకు కడియంలో సోమవారం కొంత మంది జనసేన నాయకులను కలిసి చర్చించినట్టు సమాచారం. దీంతో రూరల్, నిడదవోలు సీట్ల విషయమై ఉత్కంఠకు తెరపడింది. అయితే నిడదవోలు టీడీపీలో కూడా ఇబ్బందికర పరిస్థితి ఉంది. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషా రావుకే టికెట్ ఇవ్వాలని టీడీపీ కేడర్ డిమాండ్ చేస్తోంది. టీడీపీ టికెట్ ఆశిస్తున్న మరో నేత కుందుల సత్యనారాయణ మాత్రం టికెట్ ఎవరికిచ్చినా చంద్రబాబును సీఎం చేయడమే తన లక్ష్యమని ప్రకటించడం గమనార్హం. నిడదవోలులో టీడీపీ కేడర్‌ను బుజ్జగించే బాధ్యతను అధిష్ఠానమే తీసుకున్నట్టు తెలిసింది. ఇక రాజమహేంద్రవరం సిటీలో టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు, జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ కేడర్ కలసి ప్రచారం చేస్తున్నారు. రాజానగరంలో జనసేన అభ్యర్థి బత్తుల బల రామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ కలిసి పనిచేస్తున్నారు. అనపర్తిలో టీడీపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సహకరిస్తున్నారు. గోపాలపురంలో టీడీపీ నుంచి మద్దిపాటి వెంకట్రాజు పేరు ఖరారైనట్టు పార్టీ పెద్దలు చెబుతున్నా ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజుకు జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు సహకరిస్తున్నారు. కొవ్వూరులో అభ్యర్థి ప్రకటన ఇప్పటికీ జరగలేదు. నిడదవోలులో జనసేన కార్యకర్తలు టీడీపీతో కలిసి పనిచేస్తున్నారు. మరో వైపు ఎంపీ టికెట్‌పై కూడా ఉత్కంఠ వీడినట్టు సమాచారం.బీజేపీతో పొత్తు లేకపోతే రాజా నగరం నియోజక వర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగుతారని తెలిసింది.ఇప్పటికే అధినేతల వద్ద టిక్కెట్లు ఖరారు కావడంతో త్వరలో మరో జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది. రాజమహేంద్రవరం రూరల్ టెన్షన్ ఎట్టకేలకు తీరింది.


కేంద్ర బలగాల కవాతును ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

మేమున్నాం.. ధైర్యంగా ఓటేయండి
నగరంలో భద్రతా బలగాల కవాతు

రాజమహేంద్రవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): 'మేమున్నాం.. ధైర్యంగా పోలింగ్ బూత్‌కి వచ్చి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి' అనే సందేశమిస్తూ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు వచ్చిన కేంద్ర బలగాలతో స్థానిక పోలీసులు కలిసి కవాతు చేశారు. 200 మంది సీఆర్పీఎఫ్ జవానులు, 200 మంది రాష్ట్ర పోలీసులు ప్రజలకు భరోసానిచ్చారు. కంబాల చెరువు సమీపంలోని వివేకానంద సర్కిల్ నుంచి పచ్చజెండా ఊపి కవాతును కలెక్టర్ డా.కె.మాధవీలత ప్రారంభించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించే క్రమంలో కవాతు నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో పోలీస్ వ్యవస్థ ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. ఇప్పటికే జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఎస్పీ జగదీశ్ సూచనలతో రానున్న రోజుల్లో మరిన్ని రాష్ట్ర, కేంద్ర భద్రతా బలగాలు జిల్లాకు రానున్నాయని తెలిపారు.ఎస్పీ జగదీశ్ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి రాజకీయ పార్టీలు,ప్రజలు సహకరించాలని కోరారు. అవసరాలకు అనుగుణంగా బలగాలు మోహరిస్తామని చెప్పారు. కార్యక్ర మంలో కమిషనర్ కె.దినేశ్‌కుమార్,అడిషనల్ ఎస్పీలు పి.అనిల్ కుమార్, ఎల్.చెంచిరెడ్డి, ఎస్బీ డీఎస్పీ డి.ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్ సూరి అప్పారావు పాల్గొన్నారు.

పాత పెన్షన్ హామీకే ఉద్యోగుల మద్దతు
యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానం



రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 4 : పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిన రాజకీయపార్టీకే వచ్చే ఎన్నికల్లో ఉద్యోగుల మద్దతు ఉంటుందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. రాజమహేంద్రవరం యూటీఎఫ్ భవన్‌లో సోమవారం జరిగిన తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గసమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రంలో సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీలు పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చాయన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.అరుణకుమారి, జిల్లా అధ్యక్షులు జయకర్, ప్రధాన కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ కమిటీ నివేదిక వచ్చేలోపు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బాదుడే.. బాదుడు



పేదోడిపై పెద్ద భారం

- కష్టంగా మారిన బతుకులు
- ఐదేళ్లలో అన్ని చార్జీలూ పెంపు
- దొడ్డిదారి చార్జీలతో కరెంట్ షాక్
- బస్సెక్కితే టికెట్ ధరల మోత
- ఊరెళ్లాలంటేనే భయం
- స్థలం రిజిస్ట్రేషన్ చార్జీల వాత
- పెరిగిన నెలవారీ బడ్జెట్
- అటకెక్కిన పేదోడి పొదుపు
- మళ్లీ ఎందుకు సిద్ధం?

ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగడానికి వస్తున్నారు.. ఇదీ గతంలో ఒక పెద్దావిడ అధికార పార్టీ నాయకులను ప్రశ్నించిన కడుపుమంట.. ఎందుకంటే మధ్య తరగతి జనం కరెంట్ బిల్లు కట్టాలంటే కటకటలాడి పోతున్నారు.. ఏసీ ఉంటే చాలు బిల్లు బాదుడే.. రూ.3 వేలు దాటి వచ్చేస్తోంది. 200 యూనిట్లు దాటినా బాదుడే మరి.. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కరెంట్ బిల్లులతో షాక్ కొట్టించింది. ఇక బస్సెక్కి కుటుంబంతో ఏదైనా ఊరు వెళ్లాలన్నా కష్టమే.. ఐదేళ్లలో మూడు సార్లు బస్సు చార్జీలపై బాదేశారు.. ఏదైనా స్థలం కొనుగోలు చేసుకుందామన్నా రిజిస్ట్రేషన్ చార్జీల గురించి ఆలోచించాల్సిందే.. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ సంక్షేమం ముసుగులో బాదుడుకు తెరలేపారు.. తెలియకుండా పేదోడి జేబు ఖాళీ చేస్తున్నాడు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పాలకులు ప్రజలపై కక్ష కట్టినట్టు ఇష్టానుసారం వ్యవహరించడం సామాన్యుడి పాలిట శాపమైంది. ఈ ఐదేళ్లలో విపరీతంగా పెరిగిన ధరలతో రెక్కలు ముక్కలవుతున్నా బతుకు బండి సాఫీగా సాగడం లేదు. రోడ్ల మాదిరిగానే జీవనం కూడా ఆర్థికంగా గుంతలమయంగా మారింది.జగన్మాయను పసిగట్టలేకపోయిన దైనందిన జీవనం దగా పడింది.విద్యుత్, ఆర్టీసీ, భూముల ధరలు/ రిజిస్ట్రేషను చార్జీలు విపరీతంగా పెరిగిపోయాయి. పాల కుల అనుభవ రాహిత్యం.ప్రతిపక్షాలపై కక్ష తీర్చుకోవ డంలో ఉన్న శ్రద్ధ ప్రజా జీవనం మెరుగుపరచడంలో లేక పోవడంతోఅన్ని వర్గాల ప్రజలూ అప్పుల్లో కూరుకుపోతున్నారు.

విద్యుత్ బిల్లుతో జేబుకు చిల్లు



విద్యుత్ బిల్లులు చూస్తుంటే గుండె గుభేల్‌మంటోంది. పేదలకైతే స్విచ్‌పై చేయి వేయాలంటే వణుకుపుడుతోంది. సామాన్యుడికి 'ఫ్యాను' వేయాలంటే దడే. విద్యుత్ బిల్లులు గతంలో ఎప్పుడూ లేనివిధంగా షాక్ కొట్టేస్తున్నాయి. గతంలో రూ.300 వచ్చే బిల్లు అమాంతం రూ.వెయ్యికి పాకిపోయింది. 24 గంటలూ ఎడతెరిపిలేని విద్యుత్ అంటూ ఊదరగొడుతున్న పాలకులు వాటికి సంబంధించిన చార్జీలను ప్రజలపై బాదేయడం.. అదీ విచక్షణా రహితంగా ఉండడం బాధ కలిగించే అంశం. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో సాధారణంగా కరెంటు వినియోగం ఎక్కువ. అప్పుడు ప్రభుత్వం ఎక్కువ మొత్తం వెచ్చించి విద్యుత్ కొనుగోలు చేసి ఇళ్లకు సరఫరా చేస్తుంది. ఆ డబ్బులను తర్వాత బిల్లుల్లో లాగేస్తుండడమే బిల్లుల మోతకు కారణం. గత ప్రభుత్వంలో లేదా? అని వైసీపీ పాలకులు ఠక్కున ప్రశ్న వదిలేస్తారు. అయితే అప్పుడు ఇంత దారుణం లేదు. ట్రూఅప్ పేరుతో 18 వాయిదాల్లో బిల్లుల ద్వారా రాబట్టుకొనేవాళ్లు. కానీ ఇప్పుడు ఎఫ్‌పీపీసీఏ-1 పేరుతో 2021 ఏప్రిల్ నెల నుంచీ వినియోగాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. 2022 మార్చి వరకూ మూడు నెలలు చొప్పున నాలుగు విభాగాలు చేసి చివరి విభాగానికి (క్వార్టరుకు) వచ్చేసరికి యూనిట్‌కి 0.6455పైసలు వసూలు చేశారు. తర్వాత ఏఫ్‌పీపీసీఏ-2 అంటూ 2022 ఏప్రిల్ నుంచి మొదలు పెట్టారు. యూనిట్‌కి ఏకంగా 40 పైసల చొప్పున తర్వాత నెలకు జోడిస్తారు. అంటే ఏప్రిల్, మే నెలల్లో వాడిన యూనిట్లకు 40పైసల చొప్పున జూన్ నెల బిల్లుకు జతచేస్తారు. ఈ తతంగం ప్రస్తుతం కొనసాగుతోంది. ఇక మరీ దారుణమైన దొంగ దెబ్బ విషయానికి వస్తే.. స్లాబులను పెంచేయడం. గత ప్రభుత్వంలో గృహవినియోగానికి 0-50 వరకూ యూనిట్‌కి రూ.1.45, 51-100 రూ.2.60, 101-200 రూ.3.60 ఉండేది. 2022 ఏప్రిల్ నుంచి స్లాబులను సవరించడం ద్వారా జేబులకు సాధ్యమైనంత మేర చిల్లులు పెట్టడం మొదలెట్టారు. కనిష్ఠంగా 50 యూనిట్లను 30కి తగ్గించారు. 0-30 వరకూ యూనిట్‌కి రూ.1.90,31-75 రూ.3, 76-125 రూ.4.50.. ఇలా బాదేశారు.గత ప్రభుత్వంలో 500 యూనిట్లు దాటితే యూనిట్‌కి రూ.9.06 చొప్పున బిల్లు పడేది. దానికి 400కి తగ్గించి యూనిట్ ధరను ఏకంగా రూ.9.75 చేసేశారు.

స్థలం కొంటే రిజిస్ట్రేషను మోత

పూర్వం నువ్వులను పిండి నూనె తీసేవాళ్లట. కానీ వైసీపీ పాలకులు మాత్రం జనాల జేబులను పిండి ప్రభుత్వం నడుపుతున్నారు. ఓ 200గజాలు కొనుక్కొని ఇల్లు కట్టుకోవాలనేది ప్రతి సామాన్యుడి కల. ఇప్పుడు ఆ కలను ఏదోలా నిజం చేసుకున్నా.. రిజిస్ట్రేషను చేయించుకోవడానికి మాత్రం కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. భూముల మార్కెట్ విలువను ప్రభుత్వం ఎడాపెడా పెంచేయడంతో రిజిస్ట్రేషను చార్జీలు అమాంతం పెరిగిపోయాయి. పైగా అభివృద్ధి చెందిన చోట అధిక ఆదాయాన్ని రాబట్టుకునే విధంగా ప్రభుత్వం ప్రణాళిక చేస్తోంది. 2023 జూన్ 1 నుంచి మార్కెట్ విలువను 10-30 శాతం, ప్రధాన ప్రాంతాల్లో 50 శాతం వరకూ పెంచారు. ఎస్‌ఈజడ్ దగ్గరలో అయితే 75 శాతం మార్కెట్ విలువ పెరిగిపోయింది. దీని కోసం భూమి ధర సవరణలో డైనమిక్ మోడ్‌ని అవలంభించింది. ప్రతి మండలంలో 20 శాతం గ్రామాలను లేదా పట్టణాల్లో కొన్ని వార్డులను తీసుకొని అంతకుముందు ఏడాదిలో అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరిగిన ప్రాంతాలను అంచనా వేసి పెంపుదల అమలు చేసింది. అంతకు ముందు కూడా భూముల మార్కెట్ విలువను పెంచారు. దీంతో రిజిస్ట్రేషనుకు తడిచి మోపెడవుతోంది. ఇక, ప్రైమ్ 2.0 అంటూ ఆస్తి ప్రజలది.. ఒరిజినల్ పత్రాలు ప్రభుత్వానికి అనే స్థాయికి పాలకులు బరితెగించారు. జిరాక్సు కాపీలు మాత్రమే యజమానుల చేతిలో పెట్టే పన్నాగం పన్నారు. ఇప్పుడు ప్రైమ్ 2.0 జనాలను ముప్పుతిప్పలు పెడుతోంది. క్రయవిక్రయదారులు గంటల తరబడి రిజిస్ట్రారు కార్యాలయం వద్ద పడిగాపులు పడాల్సి వస్తోంది. 150 ఏళ్లకు పూర్వం నుంచీ ఉండే వేలిముద్రల రిజిస్టరును తీసేశారు. పూర్తిగా డిజిటల్ విధానం అంటూ ప్రభుత్వ సర్వర్లలో సమాచారాన్ని నిక్షిప్తం చేస్తున్నారు. అది ఎంత వరకూ భద్రమో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సాంకేతికంగా ఒకవేళ ట్యాంపరింగ్ జరిగినా భౌతికంగా నిరూపించే వేలిముద్రల రిజిస్టరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తప్పకపోవచ్చు. బాదుడే బాదుడును ప్రశ్నించేదెవరు అనుకుంటూ ఆవేదన చెందుతున్న సామాన్యుడు తన కోసం వస్తున్న ఓ రోజు కోసం ఎదురు చూస్తున్నాడనేది మాత్రం నిశ్శబ్ద నిజం.



బస్సెక్కితే బాదుడే

'ప్రగతి రథ చక్రం' ఆవేదనగా అడుగులు వేస్తోంది. ఒకవైపు గతుకుల రోడ్లు.. మరోవైపు నిర్వహణకు డబ్బులు లేకపోవడంతో అలాగే నెట్టుకొస్తోంది. ప్రయాణంలో బస్సు చక్రాలు ఊడిపోయే దుస్థితికి పాలకులు ఆర్టీసీని తీసుకొచ్చారు. మరోవైపు చార్జీల వాతలు పెడుతూ సామాన్యుడిపై మోయలేని భారం వేస్తున్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఐదేళ్లలో టికెట్ చార్జీలను మూడుసార్లు బాదేశారు. 2019 డిసెంబరు, 2022 ఏప్రిల్, 2022 జూన్ నెలల్లో టికెట్ చార్జీలను పెంచేశారు. దీంతో ఒక కుటుంబం ఎక్కడికైనా వెళ్లాలంటే రూ.500 అయ్యే టికెట్ రూ.వెయ్యికి చేరుకుంది. పైగా తిరుగుతున్న వాటిలో పల్లెవెలుగు బస్సులే ఎక్కువగా ఉంటున్నాయి. కండీషన్ మాటను పక్కనపెట్టి రంగులు పూసి తిప్పేస్తున్నారు. ప్రైవేటు బస్సుల మాట ఎలా ఉన్నా ప్రభుత్వం వారి బస్సు ఎక్కితే దిగేసరికి చెవులకు చిల్లులు తప్పవనే పరిస్థితి ఉంది. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం డిపోకి సంబంధించి 143 బస్సులు తిప్పుతున్నారు. అల్ట్రా పల్లెవెలుగు కేవలం 16 మాత్రమే ఉన్నాయి. వీటి అవసరత ఇంకా ఉన్నా ఎప్పుడు ప్రభుత్వం దయ తలుస్తుందో తెలియదు. దీనికితోడు వైసీపీ సమావేశాలకు ఆర్టీసీ బస్సులను ఇష్టానుసారం పంపేస్తున్నారు. వాటికి సంబంధించిన బిల్లుల విషయంలో ఆర్టీసీ పరిస్థితి కక్కలేక మింగలేక అనే చందంగా మారింది.

గోదారిలో మాయ!

డ్రెడ్జింగ్ గందరగోళం



- ఆగని అఖండ ఇసుక దోపిడీ
- గోదావరిలో డ్రెడ్జింగ్ బిల్లులకు ఒత్తిడి
- నిబంధనలకు నీళ్లొదిలేసి మరీ తవ్వకాలు
- ఎన్నికల ముందే బిల్లులకు ప్రయత్నాలు
- ఉన్నతాధికారుల నుంచి హెచ్చరికలు
- భయపడుతున్న ఇరిగేషన్ అధికారులు
- కొందరు సిద్ధం.. మరికొందరు విముఖత

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గోదావరిలో డ్రెడ్జింగ్ అక్రమాలు జోరందుకున్నాయి. అధికారికంగా ఎవరు డ్రెడ్జింగ్ చేస్తున్నారో..అనధికారికంగా ఎవరు చేస్తున్నారో స్పష్టత లేని పరిస్థితి.దీంతో అఖండ గోదావరిలో రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ఇదిలా ఉండగా అధికారిక డ్రెడ్జింగ్ ఇంకా పూర్తి కాకుండా ఎన్నికల ముందే బిల్లులు చేసుకునే ప్రయత్నాలు మొదలయ్యాయి.ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు వస్తున్నట్టు సమాచారం.రాజమహేంద్రవరం, కొవ్వూరు మధ్య అఖండ గోదావరిలో బ్యారేజికి మూడు కిలోమీటర్ల తర్వాత నుంచి నాలుగో బ్రిడ్జికి 800 మీటర్ల ఇవతల నుంచి డ్రెడ్జింగ్ కోసం 2022లో రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలిచింది. మొత్తం కోటిన్నర క్యూబిక్ మీటర్ల ఇసుక మేటలు డ్రెడ్జింగ్ చేయడానికి రాజమహేంద్రవరం ఏటిగట్టు వైపు రూ.144 కోట్లు, కొవ్వూరు వైపు రూ.124 కోట్లకు ప్యాకేజీలు ఖరారు చేస్తూ టెండర్లు ఆహ్వానించింది. మూడు కంపెనీలు టెండర్లు దాఖలు చేశాయి. అప్పట్లో రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీకే ఖరారు చేయాలని పెద్దలు ఒత్తిడి చేయడంతో ఇరిగేషన్ అధికారులు నిరాకరించారు.ఈ నేపథ్యంలో ఒక ఎస్‌ఈతో పాటు మరికొందరు బదిలీ వేటుకు గురయ్యారు. తర్వాత కావాల్సిన వారిని రప్పించుకుని ఈ టెండర్ ఓకే చేశారు.కానీ ఖరారైన తర్వాత ఏడాదికి పైగా ఆ కంపెనీకి పనులు చేసుకునే అవకాశం రాలేదు. ఈలోపు ఆర్కే అనే వ్యక్తి జేపీ సంస్థ తరపున డ్రెడ్జింగ్ ఆరంభించాడు. ఇటీవల హైకోర్టు ఆదేశించడంతో ఏడాదికి పైగా మౌనంగా ఉన్న రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరిట డిసెంబర్ నుంచి డ్రెడ్జింగ్ పనులు ఆరంభమైనట్టు ఇరిగేషన్ అధికారులు చెబుతు న్నారు. కానీ నిబంధనల ప్రకారం మొదట డ్రెడ్జింగ్ చేయ డానికి గోదా వరిలో ఎక్కడ ఎంత ఇసుక ఉందనే విషయాన్ని కొలతలు(సౌం డింగ్స్ అంటారు) తీయాలి.డ్రెడ్జింగ్ చేసిన ఇసుకను గోదావరి ఒడ్డున పాండ్స్ తవ్వి డ్రెడ్జింగ్ చేసిన ఇసుకను గొట్టాల ద్వారా ఈ పాండ్స్‌లో వేయాలి. నీరు ఆరిపోయిన తర్వాత ఇసుకను బయటకు అమ్మాలి. అమ్మే ముందు గోదావరిలో ఎంత తవ్వారో కొలతలు ఉండాలి. పాండ్స్ లెవల్ తీసి ఎంత ఇసుక ఉందో కూడా కొలతలు తీయాలి.ఇవేమీ లేకుండా ఇసుక డ్రెడ్జింగ్ పేరిట అక్రమాలకు కొందరు పెద్దలు పాల్పడుతున్న సంగతి తెలిసిందే. ఇక్కడ రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థ ఓ పద్ధతి ప్రకారం డ్రెడ్జింగ్ చేయడం లేదనే ఆరోపణలు ఉండడమే కాక రాష్ట్రంలో ఇసుక కాంట్రాక్టు దక్కించుకున్న ప్రతిమా సంస్థ పేరుతో ఆర్కే అనే వ్యక్తి అనేక ర్యాంపుల నిర్వాహకుల ద్వారా వందలాది మెకనైజ్డ్ బోట్లతో డ్రెడ్జింగ్ చేస్తున్నారు.గాయత్రీ, కాతేరు, కొవ్వూరు వైపు ఈ దందా విపరీతంగా జరుగుతోంది.ఇటీవల కొందరు అధికారుల ఇక్కడ లోపాలను ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్లారు.కానీ ఎవరూ పట్టించుకోవడంలేదు.

నాలుగో బ్రిడ్జి పక్కనే తవ్వకాలు..

వంతెనల సమీపంలో డ్రెడ్జింగ్ చేయకూడదనే నిబంధన ఉంది. మనుషులతో కూడా తీయించకూడదు. కానీ ఫోర్త్ బ్రిడ్జి అతి సమీపంలో దారుణంగా పగటి పూట కూడా డ్రెడ్జింగ్ చేస్తున్నారు.గతంలో రాత్రుళ్లు చేసేవారు. ప్రస్తుతం పగటి పూట చేస్తున్నారు. దీని వల్ల వంతెనలకు రక్షణ కరవుతోంది. తెలంగాణ లోని కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద ఇసుక తవ్వకాల వల్లే ప్రాజెక్టుకు బీటలు వారాయని.ఇక్కడ కూడా అటువంటి ప్రమాదం ముంచుకొచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ డ్రెడ్జింగ్ ఒక పద్ధతిలేకుండా జరిగిపోతుంటే, మరొక పక్క బిల్లుల ఒత్తిడి పెరిగింది. ఇప్పటికీ ఎంత డ్రెడ్జింగ్ చేశారో సరైన లెక్కలు లేవు. డ్రెడ్జింగ్ చేసిన ఇసుకను ఏపీఎండీసీ ద్వారా మైన్స్ అధికారులు విక్రయించాలి. అటువంటిది కూడా ఇక్కడ లేదు. ఒక వేళ రాఘవా కన్‌స్ట్రక్షన్ సంస్థ ద్వారా ఆర్కే అనే వ్యక్తి ఒప్పందం పెట్టుకున్నా.. అది కూడా ఎవరూ ధ్రువీకరించడంలేదు.కానీ డ్రెడ్జింగ్ సొమ్ము మొత్తం బిల్లులు చేయాలని అధికారులపై ఒత్తిడి పెరిగినట్టు సమా చారం. చేయకపోతే, వేరేచోటకు పొమ్మని కూడా హెచ్చరిస్తున్నట్టు తెలిసింది. కొందరు ఇందులో ఏదో డబ్బులు వస్తాయనే భ్రమలో బిల్లులు చేసే పని కోసం బాధ్యతలు అప్పగించమని కూడా పోటీ పడుతుండడం గమనార్హం. ఇందులో ఎవరు మునుగుతారో.. ఎవరు తేలతారో ఇప్పుడే అర్థంకాదు.

ప్రేమజంట ఆత్మహత్య

- రాజమహేంద్రవరానికి చెందిన ఇద్దరూ మైనర్లే
- అల్లూరి జిల్లా అనంతగిరి మండలం కరకవలస సమీపంలో చెట్టుకు ఉరేసుకుని చనిపోయిన వైనం
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు

అరకులోయ, మార్చి 4: అల్లూరి జిల్లా అనంతగిరి మండలం కరకవలస గ్రామ సమీపంలో కటికి జలపాతానికి వెళ్లే దారిలో ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని హుకుంపేట ప్రాంతానికి చెందిన ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనకు సంబంధించి అరకులోయ ఎస్ఐ సంతోష్‌కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. హుకుంపేటలో నివాసం ఉంటున్న చప్పా చైతన్య (17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన బాలిక జ్యోత్స్న (14) హైస్కూల్‌లో చదువుతున్నది. వీరిద్దరూ గత నెల 27వ తేదీన ఇంటి నుంచి బయటకు వచ్చారు. తర్వాత ఇంటికి చేరకపోవడంతో తల్లిదండ్రులు ఆ ప్రాంతంలోని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అనంతగిరి మండలం కరకవలస గ్రామ సమీపంలోని కటికి జలపాతానికి వెళ్లే దారిలో ఇద్దరూ ఉరి వేసుకుని మృతి చెందడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి విచారణ చేయగా వారిద్దరూ రాజమండ్రి ప్రాంతానికి చెందిన చైతన్య, జోత్స్నగా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. సోమవారం సాయంత్రం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

చైతన్య జోత్స్న మృతి విషయం తెలియగానే ఇక్కడికి చేరుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. చైతన్య ప్రేమలో ఉన్నట్టు తెలియదని తండ్రి చప్పా శ్రీను లబోదిబోమని విలపించాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నామని, చైతన్య ఇంటర్‌లో ఒక సబ్జెక్టు ఫెయిల్ కావడంతో పరీక్ష రాసేందుకు సిద్ధ మవుతున్నాడని, రెండు రోజుల్లో పరీక్ష రాయాల్సి ఉందని, ఈసారి తప్పకుండా పాసవుతానని చెప్పాడని, ఈ క్రమంలో ఇంత అఘాయిత్యానికి పాల్పడతాడని ఊహించలేదని ఆయన వాపోయాడు. జోత్స్న బంధువులు మాట్లాడుతూ స్కూల్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఊరంతా వెతి కామని, ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇంతలో విషాద వార్త వినడాన్ని తట్టుకోలేకపోతున్నామని వాపోయారు. వారి ప్రేమబంధాన్ని తమకు చెప్పినా బాగుండేదని రోదించారు.

ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలు అరెస్టు

తుని రూరల్, మార్చి 4: తుని రైల్వేస్టేషన్ పరిధిలో రైళ్లల్లో చార్జింగ్ పెట్టి నిద్రపోతున్న ప్రయాణికులే లక్ష్యంగా సెల్‌ఫోన్‌లు చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 8 కంపెనీలకు చెందిన 6 సెల్‌ఫోన్‌లు స్వాధీన పరుచుకుని కాకినాడకు చెందిన వల్లి రాజేష్, పిఠాపురానికి చెందిన బోడకుర్తి రాజేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విజయవాడ రైల్వే కోర్టులో హాజరుపరచనున్నట్లు రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ పితాని శ్రీనివాస్, కానిస్టేబుల్ ఎస్. రామకోటిను అభినందించారు.



సెల్‌ఫోన్ దొంగలను అరెస్టు చేసిన పోలీసులు

దిండి రిసార్ట్స్‌లో అవకతవకలు

మేనేజర్, నలుగురు ఉద్యోగులపై పోలీసులకు ఫిర్యాదు

మలికిపురం, మార్చి 4: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం దిండి ఏపీ టూరిజం రిసార్ట్స్‌లో భారీగా అవకతవకలు జరిగినట్టు రాజోలు సీఐ గోవిందరాజు సోమవారం తెలిపారు. రిసార్ట్స్‌లో సుమారు కోటి రూపాయల మేర అవకతవకలు జరిగినట్టు ఫిర్యాదు అందిందన్నారు. మేనేజరు ఫణీంద్రతో పాటు మరో నలుగురు ఉద్యోగులు 2021 నుంచి ఈ అవకతవకలకు పాల్పడ్డారన్నారు. గత 25 రోజులుగా దిండి రిసార్ట్స్‌లో టూరిజం, విజిలెన్స్ అధికారులు రికార్డులను పరిశీలించి మలికిపురం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.1,16,36,260 అవకతవకలు జరిగినట్టు ఫిర్యాదు అందిందన్నారు. రాజోలు సీఐ గోవిందరాజు ఆధ్వర్యంలో మలికిపురం ఎస్ఐ సంపత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

ముమ్మిడివరం, మార్చి 4: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి మల్లాయిపాలెం పరిధిలోని కొత్త కాలనీలో సానబోయిన దేవిశ్రీ భర్తమోహన్, అత్తమామలతో కలిసి నివాసం ఉంటోంది. వారికి పన్నెండేళ్ల కుమారుడు తనూజనాగసూర్య, ఎనిమిదేళ్ల కుమార్తె వర్షిణి ఉన్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్న నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో నేరస్తుడికి జీవిత ఖైదు

రాజమహేంద్రవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నేరం రుజువు కావడంతో నేరస్తుడికి తొమ్మిదో అదనపు జిల్లా కోర్టు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శాటిలైట్ సిటీలోని డీ బ్లాక్‌కు చెందిన బోయిన ముసలయ్య, నీలాల మంగారావు రాండ్ బెండింగ్ పనికి వెళ్లేవారు. వాళ్లతో ముసలయ్య అన్న దుర్గారావు కూడా వెళ్లేవాడు. అయితే దుర్గారావుతో మంగారావు మందు తాగించి పాడు చేస్తున్నాడని దుర్గారావు తండ్రి మంగారావును మందలించాడు. ఈ క్రమంలో 2019 ఫిబ్రవరి 25న గొడవ జరిగింది. దీంతో మంగారావుపై ముసలయ్య కక్ష పెంచుకున్నాడు. మరుసటి రోజు ఉదయం పనికి వెళదామంటూ మంగారావును ముసలయ్య కల్లు దుకాణానికి తీసుకెళ్లి బాగా తాగించాడు. ఇంటికి తీసుకెళతానని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని కవలగొయ్యి వెళ్లే దారిలో ఓ తోట వద్ద మంగారావును కిందపడేసి ముఖంపై బండరాయితో కొట్టి చంపేశాడు. దీనిపై అప్పటి బొమ్మూరు సీఐ కె.దామోదర్‌రావు కేసు నమోదు చేశారు. బోయిన ముసలయ్యపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.ఏ.బాషా, కోర్టు విచారణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన బొమ్మూరు సీఐ ఎండీ ఉమర్ తదితరులను ఎస్పీ జగదీశ్ అభినందించారు. ట్రైల్ కేసుల ప్రత్యేక పర్యవేక్షణ ఫలితాలనిస్తోందని ఆయన చెప్పారు.

మెరిట్ లిస్ట్ ప్రదర్శన

జీజీహెచ్(కాకినాడ), మార్చి 4: ఉమ్మడి జిల్లా నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్‌లో ప్రకటించిన ఫార్మాసిస్ట్, లాస్ట్ గ్రేట్ సర్వీసెస్ ఎల్‌జీఎస్ పోస్టుల నియామకం కోసం అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్ జాబితాలను ఆన్‌లైన్ ఎన్ఐసీలో ప్రదర్శించినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ తెలిపారు. అభ్యర్థులు లిస్ట్‌ను పరిశీలించుకుని అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈనెల 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కాకినాడలో జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ కింది వెబ్‌సైట్‌లో జాబితాలను పరిశీలించుకోవాలన్నారు.

http://eastgodavari.ap.gov.in
http://kakinada.ap.gov.in
http://konaseema.ap.gov.in

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కరప, మార్చి 4: కరప మండలం కొంగోడు గ్రామంలో సోమవారం విద్యుత్ షాక్‌కు గురై ఒక వ్యక్తి మృతిచెందాడు. కరప పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మేడిశెట్టి రమణయ్య(42) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా సోమవారం ఉదయం రమణయ్య కొంగోడు గ్రామం ఎంట్రన్స్‌లో ఆర్చ్ పక్కన చింతా బూరయ్యకు చెందిన పాన్‌షాపుకు షెడ్డు వేసే పని చేస్తున్నాడు. షెడ్డుకు కర్రలు కడుతుండగా ప్రమాదవశాత్తు ఫ్రిడ్జ్ విద్యుత్ వైర్లు ఇనుప రాడ్‌కు తగిలి రమణయ్య షాక్‌కు గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న రమణయ్యను గొల్లపాలెం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. అతని భార్య శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

ప్రజాదరణ పొందిన నేత వరుపుల రాజా

రాజా విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రులు రాజప్ప, సుజయకృష్ణ

ప్రత్తిపాడు, మార్చి 4: ప్రజల మన్ననలతో రాజకీయాల్లో రాణించిన గొప్ప నేత వరుపుల రాజా అని మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, సుజయకృష్ణ రంగారావు కొనియాడారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో సోమవారం టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరుపుల రాజా విగ్రహాన్ని సత్యప్రభతో కలిసి మాజీ మంత్రులు ఆవిష్కరించారు. రాజా ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ టీడీపీ అభివృద్ధి కోసం రాజా జిల్లాలో కష్టపడి పని చేశారని ఆయన లేని లోటు తీర్చలేనిదని నియోజకవర్గంలో అన్ని వర్గాల వారిని కలుపుకుని వెళుతున్న సత్యప్రభకు రాబోయే ఎన్నికల్లో ఘన విజయం చేకూర్చాలన్నారు. మాజీ మంత్రి, టీడీపీ జోనల్ 2 కోఆర్డినేటర్ సుజన కృష్ణ రంగారావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వరుపుల రాజా ఆత్మ శాంతి చేకూరే విధంగా ఎన్నికల ఫలితం ఉండాలని ఆ విధంగా రాజా అభిమానులు, కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. సత్యప్రభ భవిష్యత్ కోసం తమ పార్టీ అధినేత చంద్రబాబు ఎంతో ఆలోచిస్తున్నారని, ఆమెకు ఏ ఇబ్బంది కలగకుండా ఆమెను ముందుండి నడిపించే విధంగా తోడ్పాటు నందించాలని చంద్రబాబు తమను పదేపదే ఆదేశిస్తున్నారని చెప్పారు. అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు యనమల కృష్ణుడు, వత్సవాయి సూర్యనారాయణరాజు (మీసాల రాజు), ఎస్‌వీఎస్ అప్పలరాజులు, సానా ఫౌండేషన్ నాయకుడు సానా సతీష్ బాబు, టీడీపీ నాయకులు పర్వత సురేష్, ముదునూరి మురళీకృష్ణంరాజు, ఇతంశెట్టి భాస్కరబాబు, బద్ది రామారావు, తోట నవీన్, బొది రెడ్డి గోపి, మూది నారాయణస్వామి, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జనసేన నాయకులు వరుపుల తమ్మయ్యబాబు, తుమ్మల రామస్వామి, పెంటకోట మోహన్, దాసం శేషారావు పాల్గొన్నారు. రాజా వర్ధంతి సందర్భంగా నియోజకవర్గంలోని ఆయన అభిమానులు 100 మంది రక్తదానం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు ప్రారంభించారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

పునరావాస సమస్యలను పరిష్కరించాలని వినతి

ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ చెరుకూరి శ్రీధర్‌కు వినతిపత్రం

దేవీపట్నం,మార్చి 4: పునరావాస సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం దేవీపట్నం, తొయ్యేరు గ్రామాల పోలవరం నిర్వాసితులు విజయవాడలో ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ చెరుకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడారు. 'మండలంలో 44 గిరిజన, గిరిజనేతర గ్రామాలు పోలవరం ప్రాజెక్టు మూలంగా పూర్తిగా నీటమునిగాయి. ఇంకా అనేక మందికి భూ పరిహారాలు, పునరావాసం కూడా ఇంకా కల్పించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. వందలాది మంది ఇళ్ల నిర్మాణం పూర్తికాక నిలువ నీడలేకుండా అవస్థలు పడుతున్నారు. ప్యాకేజీకి అర్హులైన 1200 మందికి జాబితాలో చోటు దక్కలేదన్నారు. 630 ఇళ్లు పూర్తి చేయకుండానే కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు' అని అన్నారు. మొదటి, రెండు, మూడు జాబితాల్లో సుమారు 600 మందికి పునరావాసం పరిహారం జమ కాలేదన్నారు. రెండు, మూడు జాబితాల్లో ఉన్న వారితో పాటు ఇంకా 520 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో అద్దె ఇళ్లల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పునరావాస కాలనీతో పాటు దేవీపట్నం, పూడిపల్లి గ్రామాలకు ఇంకా శ్మశాన వాటికలకు స్థలం కేటాయించలేదన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం గ్రామాలను వదిలి వచ్చినప్పటి నుంచి తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలిశెట్టి శివరామకృష్ణ, సిద్ధా సత్యనారాయణ, సిద్ధా వీరబాబు, దొడ్డా సింహాద్రి, కుడిదేల గంగరాజు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తా

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం, మార్చి 4: నాలుగు రోజుల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చెప్పారు. గోకవరం మండలం కొత్తపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ఉప కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహానికి సీటు కేటాయిస్తే ఆయన గెలుపునకు సహకరించాలని ఉందని కానీ తన వర్గాన్ని ఆయన చిన్నచూపు చూడడం వల్ల మరోమారు పునరాలోచనలో పడాల్సి వస్తుందన్నారు. ఇంట్లో వాళ్లతో కూడా ఓట్లు వేయించలేని నాయకులు నరసింహం చుట్టూ చేరి ఆయనను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలను ప్రారంభించడం ఎంతవరకు సమంజసమన్నారు. తన విషయంలో అధికారులను కూడా ప్రోటోకాల్ పాటించకుండా అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల అటు నాయకుల్లోనూ, ఇటు అధికారుల్లోనూ పార్టీ పరువు దిగజారిపోతోందని ఆయన ఆందోళన చెందారు. నరసింహం తన కేడర్ మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే హోదాలో తాను కల్పించిన పదవులను సైతం తన వర్గం నుంచి చెప్పాపెట్టకుండా లాక్కొని వేరేవారికి అప్పగించారన్నారు. ఆయన తీరుపట్ల తన కేడర్ అసంతృప్తితో ఉందన్నారు.



విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న చంటిబాబు

ఘనంగా త్రయంబకేశ్వరస్వామి కల్యాణం



స్వామి వారికి అభిషేకం చేస్తున్న నవీన్ కుటుంబ సభ్యులు

జగ్గంపేట, మార్చి 4: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జరుగుతున్న కోటి పార్థివ లింగం మహారుద్రాభిషేకంలో భాగంగా సోమవారం 8వ రోజు విఘ్నేశ్వర పూజ, పరిషత్ పంచగవ్యప్రాసన, గోపూజ, మహావ్యాసము, రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, రుద్రహోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జ్యోతుల నెహ్రూమణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు పీటలపై కూర్చుని త్రయంబకేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహించారు. శ్రీ నవశక్తి క్షేత్ర విశ్వ ధర్మ పరిరక్షణ వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరమ పూజ్యశ్రీశ్రీశ్రీ భవాని శంకరానంద స్వామి మహారుద్రాభిషేకంలో పాల్గొన్నారు. వేలాదిగా భక్తులు పాల్గొని తమ స్వహస్తాలతో కోటి పార్థివలింగాలకు అభిషేకం నిర్వహించారు. గోకవరం గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక ధార్మిక సేవకులు కంబాల శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవాని శంకరానంద స్వామి మాట్లాడుతూ సృష్టికి మూలం ఓంకార శబ్దమని ముక్కోటి దేవతలను మనం దర్శనం చేసుకునేలా ఏర్పాటు చేసిన జ్యోతుల నెహ్రూ కైలాసమే ఇక్కడ నిర్మించారన్నట్లుగా దేవాలయాలు నిర్మించారన్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాలను ప్రతిష్ఠించారని చెప్పారు. మహారుద్రాభిషేకం కార్యక్రమం చేయడం అనితర సాధ్యమన్నారు. సాయంత్రం ప్రవచనాల సందర్భంగా శివతత్వంపై వివరించారు.

మావోయిస్టుల లేఖ విడుదల

చింతూరు, మార్చి 4 : అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని ఈ నెల 8న ఘనంగా నిర్వహించాలని భద్రాద్రి కొత్తగూడెం- అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ మావోయిస్టు పార్టీ ప్రతినిధి అజాద్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పేరిట ఓ లేఖ విడుదలైంది. మహిళలపై జరుగుతున్న అన్ని రకాల రాజ్య హింసలకు, హత్యలకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడదామని, స్త్రీ పురుష సమానత్వాన్ని సాధించుకుందామని, బ్రాహ్మణీయ హిందుత్వ మతోన్మాద సంకెళ్లను తెంచుకుందామని, స్త్రీ విముక్తి పోరు బాటలో నడుద్దామని, శ్రామిక విముక్తి లేనిదే స్త్రీ విముక్తి లేదని లేఖలో అజాద్ పేర్కొన్నారు. పల్లెల్లో రైతు మహిళల శ్రమ శక్తి దోపిడికి గురవుతోందని, పట్టణాలలో పెట్టుబడిదారులు తక్కువ వేతనాలు ఇచ్చి మహిళలతో వెట్టి చాకిరీ చేయి ంచుకుంటున్నారని ఆజాద్ ఆరోపించారు. మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఎందరో వీరవనితలు పోరాటం చేసి ప్రాణాలు అర్పించారన్నారు. పోలీసులు పాల్పడుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా ఎందరో వీర వనితలు సమర శీల పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. చివరకు వ్యాపార ప్రకటనలలో సైతం మహిళలను అశ్లీలంగా చూపిస్తూ అంగడి సరుకుగా మార్చారని అజాద్ ఆరోపించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

గోకవరం, మార్చి 4: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 16.467 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ నాగరాజు తెలిపారు. గోకవరం పోలీసులు సోమవారం జరిపిన దాడుల్లో మండలంలోని కొత్తపల్లి పెదచెరువు నుంచి రామన్నపాలెం వెళ్లే రోడ్డులో గంజాయిని తరలించడానికి సిద్ధంగా ఉన్న ఒడిసా రాష్ట్రానికి చెందిన గణపతి జిల్లాలోని చెంబాలపూర్ గ్రామానికి చెందిన అక్షయరైటా, జిబిత్‌రైటాలను అదుపులోకి తీసుకున్నామని, మరో నిందితుడు పరారీలో ఉన్నాడన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.82,335 ఉంటుందని పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

రాజమహేంద్రవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): చాగల్లు మండలంలోని కలవలపల్లిలో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ పక్కన ఖాళీ ప్రదేశంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారంతో విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు అధికారులు సోదాలు చేశారు. 46 బస్తాల్లో నిల్వ ఉంచిన 2050 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన మెట్టపల్లి నరసింహరాజు రామచంద్రాపురం, ఉనకరమిల్లి గ్రామాల్లో రేషన్ బియ్యం కిలో రూ.16 చొప్పున సేకరించి ఇటుక బట్టీలు తదితర చోట్ల పనిచేస్తున్న కూలీలకు రూ.18కి విక్రయిస్తున్నాడని గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.92,375 ఉంటుందని, నరసింహరాజుపై క్రిమినల్ కేసు నమోదుకు సిఫారసు చేశామని ఎస్పీ సుబ్బారెడ్డి తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ అమ్మకం, నిల్వలపై నిఘా పెట్టామని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోదాల్లో విజిలెన్స్ అధికారులు జగన్నాథరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగవద్దని భార్య వారించినందుకు నిప్పంటించుకున్న భర్త

సర్పవరం జంక్షన్, మార్చి 4: అనారోగ్యంతో ఉంటూ మద్యం తాగుతున్న భర్తను మద్యం తాగవద్దని భార్య వారించడంతో కోపంతో టర్పంటాయిల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎస్.అచ్యుతాపురంలో ఆదివారం రాత్రి జరిగింది. కాకినాడ 48వ డివిజన్ ఎస్.అచ్యుతాపురానికి చెందిన పైడా సుబ్బారావు (64)కు 2017లో ఆపరేషన్ జరిగింది. డాక్టర్లు మద్యం తాగవద్దని సూచించారు. అయితే గత ఆరు నెలల నుంచి కుటుంబ సభ్యులు మందలిస్తున్నా మద్యం తాగడం ప్రారంభించాడు. ఆదివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో మద్యం తాగి ఇంటికి వచ్చాడు. మద్యం ఎందుకు తాగావు, తాగవద్దని డాక్టర్లు చెప్పారు కదా అని భార్య నిలదీసింది.. దాంతో ఇంట్లో ఉన్న టర్పంటాయిల్‌ని శరీరంపై పోసుకుని నిప్పు అంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు సమీపంలో నాగమల్లితోట జంక్షన్‌లో గల ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించగా సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఇంద్రపాలెం పోలీసులు తెలిపారు. కుమారుడు భార్గవి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలి

రంపచోడవరం, మార్చి 4: ఏజెన్సీ ప్రాంతంలో జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలని, ఆదివాసీ చట్టాలను అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లాల లచ్చిరెడ్డి, కత్తుల బాలురెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేశారు. అటవీ ఫలసాయం, జీడిపిక్కలు, జాఫ్రా గింజలకు కనీస మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. తొలుత ఈ నెల పదో తేదీన ఏజెన్సీ మన్యం బంద్‌కు అన్ని వర్గాలు సహకరించాలని కోరుతూ తీర్మానించారు.

స్పందన అర్జీలను పరిష్కరించాలి

రంపచోడవరం, మార్చి 4: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు ఎం.విజయ సునీత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆమె ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి స్పందన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ సుమారు 48 అర్జీలు అందాయన్నారు. పులిగోగులపాడులో జీడిపిక్కల ప్రాసెసింగ్ ఏర్పాటు చేయాలని, 18 ఏళ్లు నిండిన వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని, భూపతిపాలెం జలాశయంలో పర్యాటక శాఖ ద్వారా విహార బోట్లకు అనుమతి మంజూరు చేయాలని, సొసైటీ సభ్యులకు చేపలు పట్టుకొనేలా ఉత్తర్వులు మంజూరు చేయాలని, గుర్తేడు, ధారకొండ, ఎడ్లకొండ గ్రామాల్లో చెక్ డ్యాములు ఏర్పాటు చేయాలని అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్డీసీలు జాన్‌రాజ్, డీఎస్ శాస్త్రీ, డీడీ షరీఫ్, ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, డీఈవో మల్లేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ విజయసునీత

ఇంటర్ పరీక్ష కేంద్రం పరిశీలన

రంపచోడవరం, మార్చి 4:

విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం. విజయసునీత చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఆమె ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు తాగునీరు, పరీక్షా కేంద్రాలలో లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్, తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

అధికారులతో సమావేశమైన కలెక్టర్ విజయసునీత



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

రంపచోడవరం, మార్చి 4: రానున్న సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత చెప్పారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టరు ప్రశాంత్‌కుమార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అధికారులు ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం విధులు నిర్వహించాలన్నారు. అలాగే ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలన్నారు. స్పందనలో ఒకసారి అందిన అర్జీని మరోసారి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. తొలుత గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతిగృహం ప్రాంగణంలో ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు.

జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలి

చింతూరు, మార్చి 4: ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే జీవో నంబరు 3ను పునరుద్ధరించాలని ఆ మేరకు చట్టబద్ధత కల్పించాలని ఆదివాసీ ప్రజా ప్రతినిధులు పూనెం ప్రదీప్‌కుమార్, వేక రాజకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం చింతూరు ఐటీడీఏ ఎదుట ఆదివాసీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్యంలో నూటికి నూరు శాతం ఉద్యోగ అవకాశాలు ఆదివాసీలకే దక్కాలన్నారు. మన్యంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఆదివాసీ చట్టాలకు వ్యతిరేకంగా ఉందన్నారు. ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ విషయంలో ప్రభుత్వం ఈ నెల 9న నోటిఫికేషన్ విడుదల చేయని పక్షంలో ఈ నెల 10న తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు బాబు బోరయ్య, కారం బాబూరావు, మీనా, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ జరిపించాలి

చింతూరు, మార్చి 4 : చింతూరు కలప డిపో కేంద్రంగా జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపి ఆ మేరకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చింతూరు లారీ యూనియన్ ఓనర్స్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డిపో వద్ద నిరసన వ్యక్తం చేశారు. డిపోలో బినామీల పర్వం నడుస్తోందని, స్థానిక యూనియన్ లారీలకు అవకాశం కల్పించకుండా బయట లారీలకు బాంబో, కలప తరలింపు అవకాశాలు కల్పించడంతో స్థానిక లారీ యూనియన్ వారు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు ఓనర్స్ పేర్కొన్నారు. అధికారుల తీరుతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని వాపోయారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ ఎన్.శ్రీను, బాలాజీ, పాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సాగునీటి సమస్యపై పాదయాత్ర

చింతూరు, మార్చి 4 : తమ గ్రామంలో సాగునీటి సమస్య ఉందని ఈ సమస్యను అధికారుల దృష్టికి పలు మార్లు తీసుకెళ్లినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని చింతూరు మండలం సూరకుంట గ్రామస్థులు వాపోయారు. ఈ మేరకు బుధవారం గ్రామం నుంచి చింతూరు ఐటీడీఏ వద్దకు 35 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసి పిదప ఐటీడీఏ పీవోకు తమ వెతలు చెప్పుకుంటామని పేర్కొన్నారు, గ్రామస్థులు పాదయాత్ర తీర్మాన ప్రతిని సోమవారం విడుదల చేశారు. మన్యంలో ఐటీడీఏ నెలకొల్పింది ఆదివాసీల సమస్యల పరిష్కారానికేనన్న విషయం విస్మరించారన్నారు. సాగునీటి సమస్యను పరిష్కరించని పక్షంలో రిలే దీక్షలు చేపడతామని హెచ్చరించారు. తీర్మాన ప్రతిని విడుదల చేసిన వారిలో సోడె శ్రీను, తోడెం చంద్రయ్య, తోడెం మల్లేశ్వరరావు, సుమన్ తదితరులు ఉన్నారు.

ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాలరాయుడు

రంపచోడవరం, మార్చి 4: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నియోజకవర్గ పరిశీలకుడు యర్రా వేణుగోపాలరాయుడు పిలుపునిచ్చారు. స్థానిక భాను కల్యాణ మండపంలో సోమవారం నియోజకవర్గ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యతతో పనిచేసి టీడీపీ, జనసేన బలపర్చిన అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి వంతల రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గొర్లె సునీత, మండల టీడీపీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

90 శాతం పనులు పూర్తి

మోతుగూడెం, మార్చి 4: డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మత్తు పనులు 90 శాతం పూర్తయ్యాయని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడుతూ మార్చి 4 నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే పనులు 90 శాతం పూర్తి కావడంతో మిగతా పనులు పూర్తి చేయడానికి మార్చి 5 వరకు గ్రిడ్ అధికారుల నుంచి ఎల్‌సీ అనుమతులు తీసుకున్నామన్నారు. కెనాల్ మరమ్మత్తు పనులు పూర్తయితే బుధవారం నుంచి కెనాల్‌లో నీటిని విడుదల చేసి గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ ఉత్పత్తిని నిర్వహిస్తామని, పొల్లూరులో విద్యుత్ ఉత్పత్తి అనంతరం 4 వేల క్యూసెక్కులు నీటిని గోదావరి డెల్టా రబీ పంటలకు నీటి విడుదలను కొనసాగిస్తామని ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ బి. శ్రీధర్ తెలిపారు.

చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

రంపచోడవరం, మార్చి 4: మహిళలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.విజయ డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మార్క్స్-ఎంగిల్స్ భవనంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో సభను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో భారీ ర్యాలీ, ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. పీవోడబ్ల్యూ పి.విజయ మాట్లాడుతూ సమాజంలో స్త్రీలకు రక్షణ కరువైందన్నారు. తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై దుర్మార్గమైన దాడులు, పాశవిక అణిచివేతలు పెరిగిపోయాయన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ నాయకులు పి.అనసూయ, ఇల్లా సూర్యకాంతం, కె.చిలకమ్మ, ఏఐకేఎంఎస్ నాయకులు పి.లచ్చిరెడ్డి, కె.బాలురెడ్డి పాల్గొన్నారు.

నేడు గుంటూరులో జయహో బీసీ సభ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 4: టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరులో జరిగే జయహో బీసీ సభను విజయవంతం చేయాలని టీడీపీ నూర్ బాషా సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్ సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. గుంటూరు నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో మధ్యాహ్నం 3గంటలకు సభ జరుగుతుందని, ఈ సభకు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, టీడీపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లు రవీంద్ర హాజరవుతారని తెలిపారు.

బ్రహ్మజోస్యులా.. మన్నించు!



సుబ్రహ్మణ్య మైదానంలో సభ జరుగుతుండగానే వెళ్లిపోతున్న మహిళలు

- వైసీపీ రాజకీయ సభకు స్వాతంత్ర్య సమరయోధుల వేదిక
- ఎంపీ సభకు జనం బలవంతంగా తరలింపు
- సచివాలయ సిబ్బందికి హుకుం
- భోజనాల వద్ద కుమ్ములాట
- యథావిధిగా నోరుపారేసుకున్న కొడాలి, పేర్ని

రాజమహేంద్రవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఇక, స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో యోధుల ప్రసంగాలకు మౌన సాక్ష్యం ఆ వేదిక.. రాజమహేంద్రవరం చరిత్రలో ఒక మణిహారం బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం మైదానం.. ప్రస్తుత ఎంపీ భరత్‌రామ్ ఆ వేదిక రూపురేఖలను మార్చేశారు.. చరిత్రను కాల గర్భంలో కలిపేశారు. అయితే సోమవారం పక్కా రాజకీయ సభకు వైసీపీ మొట్టమొదటి సారిగా వినియోగించడంతో సుబ్రహ్మణ్యం ఆత్మ మౌనంగా ఘోషించింది. వైసీపీ ఎంపీ, రాజమహేంద్రవరం సిటీ సమన్వయకర్త మార్గాని భరత్‌రామ్ ఎన్నికల శంఖారావమంటూ రాజమహేంద్రవరంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభ 'మా నేత చేలో మేస్తే నేను గట్టున మేస్తానా' అనే తీరుగా సాగింది. సుమారు గంటసేపు జరిగిన ప్రసంగాల్లో పేర్ని నాని, కొడాలి నాని, వైసీపీ నాయకులు టీడీపీని తిట్టడం, జనసైనికులకు ఉచిత సలహాలు ఇవ్వడంతోనే సరిపోయింది. రాజమహేంద్రవరానికి చేయని పనులనూ, ఆర్భాటపు అభివృద్ధిని యథావిధిగా ఎంపీ వల్లెవేశారు. ఈ కార్యక్రమానికి మహిళలను బలవంతంగా తరలించారనే విమర్శలున్నాయి. ఎప్పటి మాదిరిగానే సచివాలయం సిబ్బంది, వలంటీర్లను ఇళ్లకు పంపి సభకు రాకపోతే పథకాలను ఆపేస్తామంటూ బెదిరించి ఆటోల్లో తీసుకొచ్చారని కొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సభ ముగిసిన తర్వాత భోజన ఏర్పాట్లు చేయగా.. అన్నం దొరికితే అదృష్టమే అనే విధంగా జనాలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వృద్ధులు, పిల్లలు పట్టెడన్నం కోసం నలిగిపోయారు. భోజనాల వద్ద తాగునీరు లేక పరుగులు పెట్టారు. ఓ సమయంలో పోలీసులు కూడా నియంత్రించలేనంతగా పరిస్థితి తయారైంది. ఈ రకంగా భోజనాలు ఎవరు పెట్టమన్నారంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. సభకు అనుమతి ఉందో లేదో గానీ పోలీసులను మాత్రం బందోబస్తుకు వాడేశారు.



భోజనం ప్లేట్లతో ఎగబడుతున్న మహిళలు

భావితరాల కోసం చంద్రబాబును సీఎం చేయాలి



మార్కండేయపురంలో ఇస్త్రీ చేస్తున్న రామకృష్ణారెడ్డి

- టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి రామకృష్ణారెడ్డి

అనపర్తి, మార్చి 4: భావి తరాల భవిష్యత్ కోసం చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అనపర్తిలోని మార్కండేయపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. రామకృష్ణారెడ్డి ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో కూల్చివేతలు, తాకట్టులు మినహా ప్రజలకు చేకూరిన మేలేమీ లేదని, సంక్షేమ పథకాల పేరిట దోపిడీ జరిగిందని, కోట్లాది రూపాయలను ప్రక్కదారి పట్టించారన్నారు. ఉద్యోగ వర్గాలు, నిరుద్యోగులు పూర్తిగా మోసపోయారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, బాసి, నల్లమిల్లి వెంకటరెడ్డి, కొవ్వూరి పార్వతి, మామిడిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చికాగోలోని టీడీపీ, జనసేన శ్రేణులతో వెబినార్

చికాగోలోని టీడీపీ, జనసేన పార్టీల మిత్రులతో అనపర్తిలోని టీడీపీ కార్యాలయంలో రామకృష్ణారెడ్డి, మర్రెడ్డి శ్రీనివాసరావు వెబినార్ ద్వారా ముచ్చటించారు. చికాగోలోని మిత్రులు తమ కలయికను అభినందించారని, రాష్ట్రంలో టీడీపీ-జనసేన పొత్తు చారిత్రాత్మకమని, వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులు అఖండ మెజారిటీతో విజయం సాధించాలని ఆకాంక్షించినట్టు వారు చెప్పారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం : నల్లమిల్లి మహాలక్ష్మి

రంగంపేట, మార్చి 4: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి నల్లమిల్లి మహాలక్ష్మి అన్నారు. మండలంలోని చిన దొడ్డిగుంట గ్రామంలో ఆమె పర్యటించి ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల ద్వారా పొందే లబ్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు, కార్యదర్శి పూసల శ్రీనివాస్, టీడీపీ-జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పందనకు 41 అర్జీలు

- తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై మొరపెట్టుకున్న ప్రజలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 4: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం కమిషనర్ దినేష్ కుమార్ నిర్వహించిన స్పందనలో 41 అర్జీలు వచ్చాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కమిషనర్ దినేష్ కుమార్ అర్జీలు స్వీకరించారు. నగరంలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై శ్రీమన్నారాయణమూర్తి ఫిర్యాదు చేశారు. ఇంకా పలు సమస్యలపై ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పిఎం సత్యవేణి, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రంగంపేటలో 4 ఫిర్యాదులు

రంగంపేట, మార్చి 4: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 4 ఫిర్యాదులు అందాయని డిప్యూటీ తహశీల్దార్ ఎన్.దొరకయ్య తెలిపారు. రంగంపేట దేవి సెంటర్‌లో చెరువుగట్టును ఆక్రమించుకొని నిర్మించిన షెడ్‌ను తొలగించాలని, స్థానిక నల్ల చెరువు గట్టు పక్కన ఇళ్ల స్థలాలు కేటాయించ వద్దని, గ్రామంలో సర్వే నెంబర్ 219లో ఎకరా 8 సెంట్లు భూమి అన్యాక్రాంతమైనదని, దానిని విడిపించాలని మాజీ సర్పంచ్ మేడిశెట్టి రవిశంఖర్ స్పందనలో ఫిర్యాదు చేశారన్నారు. రంగంపేట పీహెచ్‌సీలో కనీస సౌకర్యాలు కల్పించాలని వార్డు మెంబర్ వీవీవీ సత్యనారాయణ ఫిర్యాదు అందించారన్నారు. గ్రామంలోని గండేపల్లి రోడ్డులో ఉన్న మంచినీటి బోరును మరమ్మతు చేయించాలని ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు ఫిర్యాదు చేసినట్టు డీటీ దొరకయ్య తెలిపారు.



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

బీసీ సామాజిక సమావేశాలు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 4: బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బీసీ సామాజిక సమావేశాలు నిర్వహించనున్నామని జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరాం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సామాజిక సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 4: రత్నంపేట స్లమ్ ఏరియాలో రాజమహేంద్రి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 ఆధ్వర్యంలో జరుగుతున్న సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా 4వ రోజైన సోమవారం రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్వారీ మార్కెట్ సెంటర్లోని ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియమనిబంధనలపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సత్యసౌందర్య, ఎన్ఎస్ఎస్ పీవో డీవీ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపదను భావితరాలకు అందించాలి

నన్నయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ సుధాకర్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 4: వారసత్వ సంపదను కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జి.సుధాకర్ అన్నారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలోని నేదునూరి గ్రంథాలయం వద్ద సోమవారం విద్యార్థుల వారసత్వ సంపద విజ్ఞానయాత్ర ప్రారంభంలో ఆయన మాట్లాడారు. వారసత్వ సంపద పరిరక్షణకు రాజమహేంద్రవరంలోని అధికారులు, ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. డీఈవో వాసుదేవరావు మాట్లాడుతూ వారసత్వ సంపదను ఎలా పరిరక్షించుకోవాలి అనే విషయాలను విద్యార్థులకు వివరించారు. యాత్రలో భాగంగా రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు నేదునూరి గ్రంథాలయం, దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. ప్రఖ్యాత కవి నేదునూరి గంగాధరం పంతులు, ప్రఖ్యాత చిత్రకారులు దామెర్ల రామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీకే విశ్వేశ్వరరెడ్డి, కృష్ణకుమార్, సభ్యులు నగర ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో తుంటి మార్పిడి శస్త్ర చికిత్స

వైద్యులను సత్కరించిన ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి, మార్చి 4: స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగికి తుంటి మార్పిడి శస్త్ర చికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. అనపర్తికి చెందిన శేఖర్‌కు తుంటి మార్పిడి అవసరమని గుర్తించిన వైద్యులు, ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్స నిర్వహిస్తామని చెప్పారు. దీంతో అతడు శస్త్రచికిత్స చేయించుకునేందుకు ముందుకు రావడంతో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి ఆధ్వర్యంలో నిపుణుల బృందం ఇటీవల శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్థోపెడిక్ వైద్యుడు ప్రదీప్‌సుందర్, ఎనస్థేసియా డాక్టర్ రజనీలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సత్కరించారు. ఏరియా ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులున్నారని, వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. శస్త్రచికిత్స చేసిన వైద్యులను అభినందించారు. కార్యక్రమంలో వైద్యులు తరుణ్, వర్మ, సునీత, సునీల్‌రాజ్, డేవిడ్, వాణి, డీసీ సభ్యులు బాల, ఉమాశంకర్, గుంటూరు శ్రీను, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 667 మంది హాజరు

రంగంపేట, మార్చి 4: రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీషు పరీక్షకు 692 మందిగాను 667 మంది విద్యార్థులు హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్, ఆర్ఐవో నరసింహం పరిశీలించారని, డీవోలుగా కేవీ సర్వేశ్వరరావు, ఎ.దుర్గాప్రసాద్ వ్యవహరించారన్నారు.

అయోధ్య, కాశీయాత్రకు మూడు బస్సులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 5 : అయోధ్య, కాశీ యాత్రలకు 106 మంది భక్తులతో మూడు ఆర్టీసీ బస్సులు సోమవారం రాత్రి రాజమహేంద్రవరం డిపో నుంచి బయలుదేరి వెళ్లాయి. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. భక్తులు 11 రోజుల యాత్రలో 13 పుణ్యక్షేత్రాలను దర్శించుకుని తిరిగి మార్చి 15న రాజమహేంద్రవరం చేరుకుంటారని తెలిపారు. 30 మంది ప్రయాణీకులు ఉంటే వారు కోరిన తేదీల్లో బస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్బం, అసిస్టెంట్ మేనేజర్ ఎం.అజయ్‌బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ ఈ.ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇగ్నో అడ్మిషన్లకు 10 వరకూ గడువు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 5: ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో ప్రస్తుత విద్యాసంవత్సరానికి వివిధ దూరవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం గడువును మార్చి 10వ తేదీ వరకూ పొడిగించినట్టు ఇగ్నో సమన్వయకర్త ఎంఆర్ గౌతమ్ తెలిపారు.ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విశ్వవిద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్, డిప్లమో, పీజీ డిప్లమో, డిగ్రీ, అన్ని పీజీ కోర్సుల్లో ప్రవేశాలు మార్చి 10వ తేదీ వరకూ లభిస్తాయని తెలిపారు. అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చని, ఫీజులు కూడా ఆన్‌లైన్ ద్వారానే కట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపిక చేసిన కోర్సుల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తి ఫీజు రాయితీ కూడా ఉంటుందని, వివరాల కోసం ఇగ్నో వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

మున్సిపల్ ఆయాల వేతనాలు చెల్లించాలని ధర్నా

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 4: రాజమహేంద్రవర నగరపాలక సంస్థ పాఠశాలలో పనిచేస్తున్న పార్ట్‌టైం కంటింజెంట్ వర్కర్ల(ఆయాల)కు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సోమవారం జరిగిన ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, సభ్యుడు బి.పవన్ మాట్లాడారు. ఆయాలకు 2023 ఏప్రిల్ నుంచి నేటి వరకు 10 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, గతనెల 6న ఆ నెల వేతనంతో సైతం బిల్లులు చెల్లించాలని జీవో ఇచ్చినా స్కూల్ హెచ్ఎంలకు ఇప్పటివరకు ఎటువంటి ఆదేశాలు జారీ చేయకపోవడం దారుణమన్నారు. 30 ఏళ్ళుగా పని చేస్తున్న ఆయాలకు నెలకు రూ.4వేలు మాత్రమే ఇస్తున్నారని అది కూడా పెండింగ్‌లో పెట్టడం దారుణమన్నారు. అనంతరం వారు కమిషనర్ దినేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ధర్నాలో యూనియన్‌అధ్యక్షురాలు వైరూన్సీ, శాంతి, సత్యవతి, ప్రభావతి పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే వ్యాపార లక్షణాలు అలవర్చుకోవాలి

జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు



సర్టిఫికెట్లు చూపుతున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 4: ఉత్తమ వ్యాపార లక్షణాలను విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు అన్నారు. బొమ్మూరు జిల్లా ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం జిల్లా స్థాయి ఎక్స్‌పో 2023-24 పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఆర్థిక అవసరాలను తీర్చే ప్రయత్నం చేయాలన్నారు. ఈ పోటీలకు 11 పాఠశాలల నుంచి 55 మంది విద్యార్థులు, 10 మంది గైడ్ టీచర్లు భాగస్వామ్యం వహించారు. జిల్లాలో ఉన్న పాఠశాలల నుంచి 95 ప్రాజెక్టు వర్కులు సమర్పించారన్నారు. వీటిలో 11 ప్రాజెక్టులు డైట్ కళాశాలకు రావడం అభినందనీయమన్నారు. జిల్లా నుంచి వచ్చిన ప్రాజెక్టులను పరిశీలన చేసి 2 ప్రాజెక్టులను ఎంపిక చేశామని సైన్సు ప్రాజెక్టు అధికారి నెహ్రూ తెలిపారు. కార్యక్రమంలో డీవైఈవో నారాయణ, డైట్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, జిల్లామేనేజర్ ఎం.వెంకటరమణ, సుభాషిణి పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ

దివాన్‌చెరువు, మార్చి 4: నన్నయ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 విద్యార్థులు సోమవారం దివాన్‌చెరువులో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానికంగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా నాలుగో రోజున ఓటర్ల చైతన్య కార్యక్రమం జరిగింది. పీవో ఎస్.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. అంతకుముందు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ పర్యావరణానికి హాని చేస్తుందని, ప్లాస్టిక్ కవర్‌లకు బదులు క్లాత్ బ్యాగ్‌లు, గోనెసంచులు వినియోగించడం ఉత్తమమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సునీత, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ ఉపకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

గోకవరం, మార్చి 4: ప్రజల అవసరార్థం ఏర్పాటుచేసిన విద్యుత్ ఉపకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని కొత్తపల్లి సమీపంలో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ఉపకేంద్రం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జనపరెడ్డి సుబ్బారావు, దాసరి రమేష్, వరసాల ప్రసాద్, దాసరి సతీష్, రౌతు జోగేశ్వరరావు, బదిరెడ్డి రెడ్డియ్య పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ధవళేశ్వరం, మార్చి 4: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. డ్రీమ్స్ స్కూల్లో నిర్వహించిన క్రీడోత్సవం-2024 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఒత్తిడి దూరమై మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఎ.రమేష్, ప్రిన్సిపాల్ వి.సంధ్యాకుమారి, పాల్గొన్నారు.

ఒకటో తరగతిలో ప్రవేశానికి అడ్మిషన్లు

కడియం, మార్చి 4: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ, ప్రైవేటు మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశానికి ఈనెల 5వ తేదీ నుంచి 25 తేదీ వరకు అడ్మిషన్లు స్వీకరించనున్నట్టు ఎంఈవోలు ఎంఎస్ మణికుమార్, వై.నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అడ్మిషన్లలో వివిధ వర్గాలకు చెందిన చిన్నారులకు రిజర్వేషన్ల ప్రకారం 25శాతం సీట్లు కేటాయిస్తారని, సంబంధిత పోర్టల్ ద్వారా అడ్మిషన్ల పొందవచ్చన్నారు. అడ్మిషన్లు పొందగోరు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ సచివాలయం, ఎంఈవో కార్యాలయం, నెట్ సెంటర్లలో నమోదు చేసుకోవచ్చన్నారు.

ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమే..


కోరుకొండ, మార్చి 4: ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమైందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ ఎమ్మెల్యే కార్యాలయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారధులు, బూత్‌కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. కష్టపడి పని చేసేవారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. వైసీపీ పాలనలో నియోజకవర్గంలో 25,182 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించామన్నారు. సమావేశంలో జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, నక్కా రాంబాబు, కడియాల పాపారావు, గంధం నారాయణరావు పాల్గొన్నారు.

టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా గోపి

కడియం, మార్చి 4: టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా మండలంలోని కడియపులంక గ్రామానికి చెందిన అంబికా నర్సరీ అధినేత బోడపాటి గోపాలకృష్ణ (గోపి) నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి, రాష్ట్రాధ్యక్షుడు అచ్చెన్నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గోపికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి నరసన్న సన్నిధిలో లక్ష్మీసుదర్శన యాగం

కోరుకొండ, మార్చి 4: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శ్రీఅష్టముఖ గండబేరుండ లక్ష్మీసుదర్శన యాగం నిర్వహిస్తున్నట్టు వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. సోమవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ యాగ కార్యక్రమాలు 5,6,7 తేదీల్లో జరుగుతాయన్నారు. కాగా ఈ యాగానికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు సోమవారం అంకురార్పణ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి స్పందనకు 163 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్ /సిటీ మార్చి 4: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత నిర్వహించిన స్పందనలో వలు మండలాల నుంచి ప్రజలు వచ్చి 163 అర్జీలు అందించారు.ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్ అర్జీలు స్వీకరించారు. ఆన్‌లైన్‌లో 151, ఆఫ్‌లైన్‌లో 12 అర్జీలు స్వీకరించామని తెలిపారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

నువ్వక్కడ.. నేనిక్కడ!


- నిడదవోలుకు కందుల దుర్గేష్..?
- రాజమహేంద్రవరం రూరల్‌కు గోరంట్ల?
- రాజమహేంద్రవరం ఎంపీగా బీవీఆర్ చౌదరి?
- నిడదవోలులో బుజ్జగింపు బాధ్యత అధిష్ఠానందే
- అధికారిక ప్రకటనే తరువాయి



బీవీఆర్ చౌదరి



దుర్గేష్



గోరంట్ల

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం రూరల్ సీటు విషయంలో ఒక స్పష్టత వచ్చినట్టు సమాచారం. అయితే అధికారిక ప్రకటన చేయడమే తరువాయి. టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాలో రూరల్ సీటు ప్రకటించని సంగతి తెలిసిందే.కానీ ఈ సీటును సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికే ఖాయం చేశారని.. జనసేన నేత కందుల దుర్గేష్‌ను నిడదవోలు నుంచి పోటీ చేయిస్తారని విస్తృతంగా ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. తొలి జాబితా ప్రకటన రోజున టీడీపీ అధినేత చంద్రబాబును కలిసిన విలేకరులు రాజమహేంద్రవరం రూరల్ సీటు విషయం ప్రస్తావన తేవగా గోరంట్ల, కందుల దుర్గేష్ ఇద్దరికీ పోటీ చేసే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.తర్వాత జనసేన అధిష్ఠానం నిడదవోలు నుంచి దుర్గేష్ పోటీ చేస్తే బాగుంటుందని సూచించింది. దీనిపై ఆయన తన వైఖరిని స్పష్టం చేయలేదు.ఈ నేపథ్యంలో దుర్గేష్‌ను రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థిగా ప్రకటించాలని జనసేన కేడర్ ఆందోళనలు చేసింది. ఇదిలా ఉండగా సోమవారం ఈ సీటు విషయం అధికారికంగా తేల్చేసినట్టు సమాచారం. నిడదవోలు నుంచి కందుల దుర్గేష్ పోటీకి సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది.ఈ మేరకు కడియంలో సోమవారం కొంత మంది జనసేన నాయకులను కలిసి చర్చించినట్టు సమాచారం. దీంతో రూరల్, నిడదవోలు సీట్ల విషయమై ఉత్కంఠకు తెరపడింది. అయితే నిడదవోలు టీడీపీలో కూడా ఇబ్బందికర పరిస్థితి ఉంది. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషా రావుకే టికెట్ ఇవ్వాలని టీడీపీ కేడర్ డిమాండ్ చేస్తోంది. టీడీపీ టికెట్ ఆశిస్తున్న మరో నేత కుందుల సత్యనారాయణ మాత్రం టికెట్ ఎవరికిచ్చినా చంద్రబాబును సీఎం చేయడమే తన లక్ష్యమని ప్రకటించడం గమనార్హం. నిడదవోలులో టీడీపీ కేడర్‌ను బుజ్జగించే బాధ్యతను అధిష్ఠానమే తీసుకున్నట్టు తెలిసింది. ఇక రాజమహేంద్రవరం సిటీలో టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు, జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ కేడర్ కలసి ప్రచారం చేస్తున్నారు. రాజానగరంలో జనసేన అభ్యర్థి బత్తుల బల రామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ కలిసి పనిచేస్తున్నారు. అనపర్తిలో టీడీపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సహకరిస్తున్నారు. గోపాలపురంలో టీడీపీ నుంచి మద్దిపాటి వెంకట్రాజు పేరు ఖరారైనట్టు పార్టీ పెద్దలు చెబుతున్నా ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజుకు జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు సహకరిస్తున్నారు. కొవ్వూరులో అభ్యర్థి ప్రకటన ఇప్పటికీ జరగలేదు. నిడదవోలులో జనసేన కార్యకర్తలు టీడీపీతో కలిసి పనిచేస్తున్నారు. మరో వైపు ఎంపీ టికెట్‌పై కూడా ఉత్కంఠ వీడినట్టు సమాచారం.బీజేపీతో పొత్తు లేకపోతే రాజా నగరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగుతారని తెలిసింది.ఇప్పటికే అధినేతల వద్ద టిక్కెట్లు ఖరారు కావడంతో త్వరలో మరో జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది. రాజమహేంద్రవరం రూరల్ టెన్షన్ ఎట్టకేలకు తీరింది.



కేంద్ర బలగాల కవాతును ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

మేమున్నాం.. ధైర్యంగా ఓటేయండి

నగరంలో భద్రతా బలగాల కవాతు

రాజమహేంద్రవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): 'మేమున్నాం.. ధైర్యంగా పోలింగ్ బూత్‌కి వచ్చి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి' అనే సందేశమిస్తూ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు వచ్చిన కేంద్ర బలగాలతో స్థానిక పోలీసులు కలిసి కవాతు చేశారు. 200 మంది సీఆర్పీఎఫ్ జవానులు, 200 మంది రాష్ట్ర పోలీసులు ప్రజలకు భరోసానిచ్చారు. కంబాల చెరువు సమీపంలోని వివేకానంద సర్కిల్ నుంచి పచ్చజెండా ఊపి కవాతును కలెక్టర్ డా.కె.మాధవీలత ప్రారంభించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించే క్రమంలో కవాతు నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో పోలీస్ వ్యవస్థ ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. ఇప్పటికే జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఎస్పీ జగదీశ్ సూచనలతో రానున్న రోజుల్లో మరిన్ని రాష్ట్ర, కేంద్ర భద్రతా బలగాలు జిల్లాకు రానున్నాయని తెలిపారు.ఎస్పీ జగదీశ్ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి రాజకీయ పార్టీలు,ప్రజలు సహకరించాలని కోరారు. అవసరాలకు అనుగుణంగా బలగాలు మోహరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ కె.దినేశ్‌కుమార్,అడిషనల్ ఎస్పీలు పి.అనీల్ కుమార్, ఎల్.చెంచిరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ డి.ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్ సూరి అప్పారావు పాల్గొన్నారు.

పాత పెన్షన్ హామీకే ఉద్యోగుల మద్దతు

యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానం



రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 4 : పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిన రాజకీయపార్టీకే వచ్చే ఎన్నికల్లో ఉద్యోగుల మద్దతు ఉంటుందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. రాజమహేంద్రవరం యూటీఎఫ్ భవన్‌లో సోమవారం జరిగిన తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గసమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రంలో సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీలు పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చాయన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎం. అరుణకుమారి, జిల్లా అధ్యక్షులు జయకర్, ప్రధాన కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీ నివేదిక వచ్చేలోపు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బాదుడే.. బాదుడు



ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగడానికి వస్తున్నారు.. ఇదీ గతంలో ఒక పెద్దావిడ అధికార పార్టీ నాయకులను ప్రశ్నించిన కడుపుమంట.. ఎందుకంటే మధ్య తరగతి జనం కరెంట్ బిల్లు కట్టాలంటే కటకటలాడిపోతున్నారు.. ఏసీ ఉంటే చాలు బిల్లు బాదుడే.. రూ.3 వేలు దాటి వచ్చేస్తోంది. 200 యూనిట్లు దాటినా బాదుడే మరి.. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కరెంట్ బిల్లులతో షాక్ కొట్టించింది. ఇక బస్సెక్కి కుటుంబంతో ఏదైనా ఊరు వెళ్లాలన్నా కష్టమే.. ఐదేళ్లలో మూడు సార్లు బస్సు చార్జీలపై బాదేశారు.. ఏదైనా స్థలం కొనుగోలు చేసుకుందామన్నా రిజిస్ట్రేషన్ చార్జీల గురించి ఆలోచించాల్సిందే.. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ సంక్షేమం ముసుగులో బాదుడుకు తెరలేపారు.. తెలియకుండా పేదోడి జేబు ఖాళీ చేస్తున్నాడు..



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పాలకులు ప్రజలపై కక్ష కట్టినట్టు ఇష్టానుసారం వ్యవహరించడం సామాన్యుడి పాలిట శాపమైంది. ఈ ఐదేళ్లలో విపరీతంగా పెరిగిన ధరలతో రెక్కలు ముక్కలవుతున్నా బతుకు బండి సాఫీగా సాగడం లేదు. రోడ్ల మాదిరిగానే జీవనం కూడా ఆర్థికంగా గుంతలమయంగా మారింది.జగన్మాయను పసిగట్టలేకపోయిన దైనందిన జీవనం దగా పడింది.విద్యుత్, ఆర్టీసీ, భూముల ధరలు/ రిజిస్ట్రేషను చార్జీలు విపరీతంగా పెరిగిపోయాయి. పాలకుల అనుభవ రాహిత్యం.ప్రతిపక్షాలపై కక్ష తీర్చుకోవడంలో ఉన్న శ్రద్ధ ప్రజా జీవనం మెరుగుపరచడంలో లేక పోవడంతోఅన్ని వర్గాల ప్రజలూ అప్పుల్లో కూరుకుపోతున్నారు.

విద్యుత్ బిల్లుతో జేబుకు చిల్లు

విద్యుత్ బిల్లులు చూస్తుంటే గుండె గుభేల్‌మంటోంది. పేదలకైతే స్విచ్‌పై చేయి వేయాలంటే వణుకుపుడుతోంది. సామాన్యుడికి 'ఫ్యాను' వేయాలంటే దడే. విద్యుత్ బిల్లులు గతంలో ఎప్పుడూ లేనివిధంగా షాక్ కొట్టేస్తున్నాయి. గతంలో రూ.300 వచ్చే బిల్లు అమాంతం రూ.వెయ్యికి పాకిపోయింది. 24 గంటలూ ఎడతెరిపిలేని విద్యుత్ అంటూ ఊదరగొడుతున్న పాలకులు వాటికి సంబంధించిన చార్జీలను ప్రజలపై బాదేయడం.. అదీ విచక్షణా రహితంగా ఉండడం బాధ కలిగించే అంశం. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో సాధారణంగా కరెంటు వినియోగం ఎక్కువ. అప్పుడు ప్రభుత్వం ఎక్కువ మొత్తం వెచ్చించి విద్యుత్ కొనుగోలు చేసి ఇళ్లకు సరఫరా చేస్తుంది. ఆ డబ్బులను తర్వాత బిల్లుల్లో లాగేస్తుండడమే బిల్లుల మోతకు కారణం. గత ప్రభుత్వంలో లేదా? అని వైసీపీ పాలకులు ఠక్కున ప్రశ్న వదిలేస్తారు. అయితే అప్పుడు ఇంత దారుణం లేదు. ట్రూఅప్ పేరుతో 18 వాయిదాల్లో బిల్లుల ద్వారా రాబట్టుకొనేవాళ్లు. కానీ ఇప్పుడు ఎఫ్‌పీపీసీఏ-1 పేరుతో 2021 ఏప్రిల్ నెల నుంచీ వినియోగాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. 2022 మార్చి వరకూ మూడు నెలలు చొప్పున నాలుగు విభాగాలు చేసి చివరి విభాగానికి (క్వార్టరుకు) వచ్చేసరికి యూనిట్‌కి 0.6455పైసలు వసూలు చేశారు. తర్వాత ఏఫ్‌పీపీసీఏ-2 అంటూ 2022 ఏప్రిల్ నుంచి మొదలు పెట్టారు. యూనిట్‌కి ఏకంగా 40 పైసల చొప్పున తర్వాత నెలకు జోడిస్తారు. అంటే ఏప్రిల్, మే నెలల్లో వాడిన యూనిట్లకు 40పైసల చొప్పున జూన్ నెల బిల్లుకు జతచేస్తారు. ఈ తతంగం ప్రస్తుతం కొనసాగుతోంది. ఇక మరీ దారుణమైన దొంగ దెబ్బ విషయానికి వస్తే.. స్లాబులను పెంచేయడం. గత ప్రభుత్వంలో గృహవినియోగానికి 0-50 వరకూ యూనిట్‌కి రూ.1.45, 51-100 రూ.2.60, 101-200 రూ.3.60 ఉండేది. 2022 ఏప్రిల్ నుంచి స్లాబులను సవరించడం ద్వారా జేబులకు సాధ్యమైనంత మేర చిల్లులు పెట్టడం మొదలెట్టారు. కనిష్ఠంగా 50 యూనిట్లను 30కి తగ్గించారు. 0-30 వరకూ యూనిట్‌కి రూ.1.90,31-75 రూ.3, 76-125 రూ.4.50.. ఇలా బాదేశారు.గత ప్రభుత్వంలో 500 యూనిట్లు దాటితే యూనిట్‌కి రూ.9.06 చొప్పున బిల్లు పడేది. దానికి 400కి తగ్గించి యూనిట్ ధరను ఏకంగా రూ.9.75 చేసేశారు.

పేదోడిపై పెద్ద భారం

- కష్టంగా మారిన బతుకులు
- ఐదేళ్లలో అన్ని చార్జీలూ పెంపు
- దొడ్డిదారి చార్జీలతో కరెంట్ షాక్
- బస్సెక్కితే టికెట్ ధరల మోత
- ఊరెళ్లాలంటేనే భయం
- స్థలం రిజిస్ట్రేషన్ చార్జీల వాత
- పెరిగిన నెలవారీ బడ్జెట్
- అటకెక్కిన పేదోడి పొదుపు
- మళ్లీ ఎందుకు సిద్ధం?

స్థలం కొంటే రిజిస్ట్రేషను మోత

పూర్వం నువ్వులను పిండి నూనె తీసేవాళ్లట. కానీ వైసీపీ పాలకులు మాత్రం జనాల జేబులను పిండి ప్రభుత్వం నడుపుతున్నారు. ఓ 200గజాలు కొనుక్కొని ఇల్లు కట్టుకోవాలనేది ప్రతి సామాన్యుడి కల. ఇప్పుడు ఆ కలను ఏదోలా నిజం చేసుకున్నా.. రిజిస్ట్రేషను చేయించుకోవడానికి మాత్రం కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. భూముల మార్కెట్ విలువను ప్రభుత్వం ఎడాపెడా పెంచేయడంతో రిజిస్ట్రేషను చార్జీలు అమాంతం పెరిగిపోయాయి. పైగా అభివృద్ధి చెందిన చోట అధిక ఆదాయాన్ని రాబట్టుకునే విధంగా ప్రభుత్వం ప్రణాళిక చేస్తోంది. 2023 జూన్ 1 నుంచి మార్కెట్ విలువను 10-30 శాతం, ప్రధాన ప్రాంతాల్లో 50 శాతం వరకూ పెంచారు. ఎస్ఈజెడ్ దగ్గరలో అయితే 75 శాతం మార్కెట్ విలువ పెరిగిపోయింది. దీని కోసం భూమి ధర సవరణలో డైనమిక్ మోడ్‌ని అవలంబించింది. ప్రతి మండలంలో 20 శాతం గ్రామాలను లేదా పట్టణాల్లో కొన్ని వార్డులను తీసుకొని అంతకుముందు ఏడాదిలో అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరిగిన ప్రాంతాలను అంచనా వేసి పెంపుదల అమలు చేసింది. అంతకు ముందు కూడా భూముల మార్కెట్ విలువను పెంచారు. దీంతో రిజిస్ట్రేషనుకు తడిచి మోపెడవుతోంది. ఇక, ప్రైమ్ 2.0 అంటూ ఆస్తి ప్రజలది.. ఒరిజినల్ పత్రాలు ప్రభుత్వానికి అనే స్థాయికి పాలకులు బరితెగించారు. జిరాక్సు కాపీలు మాత్రమే యజమానుల చేతిలో పెట్టే పన్నాగం పన్నారు. ఇప్పుడు ప్రైమ్ 2.0 జనాలను ముప్పుతిప్పలు పెడుతోంది. క్రయవిక్రయదారులు గంటల తరబడి రిజిస్ట్రారు కార్యాలయం వద్ద పడిగాపులు పడాల్సి వస్తోంది. 150 ఏళ్లకు పూర్వం నుంచీ ఉండే వేలిముద్రల రిజిస్టరును తీసేశారు. పూర్తిగా డిజిటల్ విధానం అంటూ ప్రభుత్వ సర్వర్లలో సమాచారాన్ని నిక్షిప్తం చేస్తున్నారు. అది ఎంత వరకూ భద్రమో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సాంకేతికంగా ఒకవేళ ట్యాంపరింగ్ జరిగినా భౌతికంగా నిరూపించే వేలిముద్రల రిజిస్టరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తప్పకపోవచ్చు. బాదుడే బాదుడును ప్రశ్నించేదెవరు అనుకుంటూ ఆవేదన చెందుతున్న సామాన్యుడు తన కోసం వస్తున్న ఓ రోజు కోసం ఎదురు చూస్తున్నాడనేది మాత్రం నిశ్శబ్ద నిజం.



బస్సెక్కితే బాదుడే

'ప్రగతి రథ చక్రం' ఆవేదనగా అడుగులు వేస్తోంది. ఒకవైపు గతుకుల రోడ్లు.. మరోవైపు నిర్వహణకు డబ్బులు లేకపోవడంతో అలాగే నెట్టుకొస్తోంది. ప్రయాణంలో బస్సు చక్రాలు ఊడిపోయే దుస్థితికి పాలకులు ఆర్టీసీని తీసుకొచ్చారు. మరోవైపు చార్జీల వాతలు పెడుతూ సామాన్యుడిపై మోయలేని భారం వేస్తున్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఐదేళ్లలో టికెట్ చార్జీలను మూడుసార్లు బాదేశారు. 2019 డిసెంబరు, 2022 ఏప్రిల్, 2022 జూన్ నెలల్లో టికెట్ చార్జీలను పెంచేశారు. దీంతో ఒక కుటుంబం ఎక్కడికైనా వెళ్లాలంటే రూ.500 అయ్యే టికెట్ రూ.వెయ్యికి చేరుకుంది. పైగా తిరుగుతున్న వాటిలో పల్లెవెలుగు బస్సులే ఎక్కువగా ఉంటున్నాయి. కండీషన్ మాటను పక్కనపెట్టి రంగులు పూసి తిప్పేస్తున్నారు. ప్రైవేటు బస్సుల మాట ఎలా ఉన్నా ప్రభుత్వం వారి బస్సు ఎక్కితే దిగేసరికి చెవులకు చిల్లులు తప్పవనే పరిస్థితి ఉంది. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం డిపోకి సంబంధించి 143 బస్సులు తిప్పుతున్నారు. అల్ట్రా పల్లెవెలుగు కేవలం 16 మాత్రమే ఉన్నాయి. వీటి అవసరత ఇంకా ఉన్నా ఎప్పుడు ప్రభుత్వం దయ తలుస్తుందో తెలియదు. దీనికితోడు వైసీపీ సమావేశాలకు ఆర్టీసీ బస్సులను ఇష్టానుసారం పంపేస్తున్నారు. వాటికి సంబంధించిన బిల్లుల విషయంలో ఆర్టీసీ పరిస్థితి కక్కలేక మింగలేక అనే చందంగా మారింది.

గోదారిలో మాయ!

డ్రెడ్జింగ్ గందరగోళం



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గోదావరిలో డ్రెడ్జింగ్ అక్రమాలు జోరందుకున్నాయి. అధికారికంగా ఎవరు డ్రెడ్జింగ్ చేస్తున్నారో..అనధికారికంగా ఎవరు చేస్తున్నారో స్పష్టత లేని పరిస్థితి.దీంతో అఖండ గోదావరిలో రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ఇదిలా ఉండగా అధికారిక డ్రెడ్జింగ్ ఇంకా పూర్తి కాకుండా ఎన్నికల ముందే బిల్లులు చేసుకునే ప్రయత్నాలు మొదలయ్యాయి.ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు వస్తున్నట్టు సమాచారం.రాజమహేంద్రవరం, కొవ్వూరు మధ్య అఖండ గోదావరిలో బ్యారేజికి మూడు కిలోమీటర్ల తర్వాత నుంచి నాలుగో బ్రిడ్జికి 800 మీటర్ల ఇవతల నుంచి డ్రెడ్జింగ్ కోసం 2022లో రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలి చింది. మొత్తం కోటిన్నర క్యూబిక్ మీటర్ల ఇసుక మేటలు డ్రెడ్జింగ్ చేయడానికి రాజమహేంద్రవరం ఏటిగట్టు వైపు రూ.144 కోట్లు, కొవ్వూరు వైపు రూ.124 కోట్లకు ప్యాకేజీలు ఖరారు చేస్తూ టెండర్లు ఆహ్వానించింది.

నాలుగో బ్రిడ్జి పక్కనే తవ్వకాలు..

వంతెనల సమీపంలో డ్రెడ్జింగ్ చేయకూడదనే నిబంధన ఉంది. మనుషులతో కూడా తీయించకూడదు. కానీ ఫోర్త్ బ్రిడ్జి అతి సమీపంలో దారుణంగా పగటి పూట కూడా డ్రెడ్జింగ్ చేస్తున్నారు.గతంలో రాత్రుళ్లు చేసేవారు. ప్రస్తుతం పగటి పూట చేస్తున్నారు. దీని వల్ల వంతెనలకు రక్షణ కరవుతోంది. తెలంగాణ లోని కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద ఇసుక తవ్వకాల వల్లే ప్రాజెక్టుకు బీటలు వారాయని,ఇక్కడ కూడా అటువంటి ప్రమాదం ముంచుకొచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ డ్రెడ్జింగ్ ఒక పద్ధతిలేకుండా జరిగిపోతుంటే, మరొక పక్క బిల్లుల ఒత్తిడి పెరిగింది. ఇప్పటికీ ఎంత డ్రెడ్జింగ్ చేశారో సరైన లెక్కలు లేవు. డ్రెడ్జింగ్ చేసిన ఇసుకను ఏపీఎండీసీ ద్వారా మైన్స్ అధికారులు విక్రయించాలి. అటువంటిది కూడా ఇక్కడ లేదు. ఒక వేళ రాఘవా కన్‌స్ట్రక్షన్ సంస్థ ద్వారా ఆర్‌కే అనే వ్యక్తి ఒప్పందం పెట్టుకున్నా.. అది కూడా ఎవరూ ధ్రువీకరించడంలేదు.కానీ డ్రెడ్జింగ్ సొమ్ము మొత్తం బిల్లులు చేయాలని అధికారులపై ఒత్తిడి పెరిగినట్టు సమాచారం. చేయకపోతే, వేరేచోటకు పొమ్మని కూడా హెచ్చరిస్తున్నట్టు తెలిసింది. కొందరు ఇందులో ఏదో డబ్బులు వస్తాయనే భ్రమలో బిల్లులు చేసే పని కోసం బాధ్యతలు అప్పగించమని కూడా పోటీ పడుతుండడం గమనార్హం. ఇందులో ఎవరు మునుగుతారో.. ఎవరు తేలతారో ఇప్పుడే అర్థంకాదు.

- ఆగని అఖండ ఇసుక దోపిడీ
- గోదావరిలో డ్రెడ్జింగ్ బిల్లులకు ఒత్తిడి
- నిబంధనలకు నీళ్లొదిలేసి మరీ తవ్వకాలు
- ఎన్నికల ముందే బిల్లులకు ప్రయత్నాలు
- ఉన్నతాధికారుల నుంచి హెచ్చరికలు
- భయపడుతున్న ఇరిగేషన్ అధికారులు
- కొందరు సిద్ధం.. మరికొందరు విముఖత

మూడు కంపెనీలు టెండర్లు దాఖలు చేశాయి. అప్పట్లో రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీకే ఖరారు చేయాలని పెద్దలు ఒత్తిడి చేయడంతో ఇరిగేషన్ అధికారులు నిరాకరించారు.ఈ నేపథ్యంలో ఒక ఎస్ఈతో పాటు మరికొందరు బదిలీ వేటుకు గురయ్యారు. తర్వాత కావాల్సిన వారిని రప్పించుకుని ఈ టెండర్ ఓకే చేశారు.కానీ ఖరారైన తర్వాత ఏడాదికి పైగా ఆ కంపెనీకి పనులు చేసుకునే అవకాశం రాలేదు. ఈలోపు ఆర్‌కే అనే వ్యక్తి జేపీ సంస్థ తరపున డ్రెడ్జింగ్ ఆరంభించాడు. ఇటీవల హైకోర్టు ఆదేశించడంతో ఏడాదికి పైగా మౌనంగా ఉన్న రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరిట డిసెంబర్ నుంచి డ్రెడ్జింగ్ పనులు ఆరంభమైనట్టు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. కానీ నిబంధనల ప్రకారం మొదట డ్రెడ్జింగ్ చేయడానికి గోదావరిలో ఎక్కడ ఎంత ఇసుక ఉందనే విషయాన్ని కొలతలు(సౌండింగ్స్ అంటారు) తీయాలి.డ్రెడ్జింగ్ చేసిన ఇసుకను గోదావరి ఒడ్డున పాండ్స్ తవ్వి డ్రెడ్జింగ్ చేసిన ఇసుకను గొట్టాల ద్వారా ఈ పాండ్స్‌లో వేయాలి. నీరు ఆరిపోయిన తర్వాత ఇసుకను బయటకు అమ్మాలి. అమ్మే ముందు గోదావరిలో ఎంత తవ్వారో కొలతలు ఉండాలి. పాండ్స్ లెవల్ తీసి ఎంత ఇసుక ఉందో కూడా కొలతలు తీయాలి.ఇవేమీ లేకుండా ఇసుక డ్రెడ్జింగ్ పేరిట అక్రమాలకు కొందరు పెద్దలు పాల్పడుతున్న సంగతి తెలిసిందే. ఇక్కడ రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థ ఓ పద్ధతి ప్రకారం డ్రెడ్జింగ్ చేయడం లేదనే ఆరోపణలు ఉండడమే కాక రాష్ట్రంలో ఇసుక కాంట్రాక్టు దక్కించుకున్న ప్రతిమా సంస్థ పేరుతో ఆర్‌కే అనే వ్యక్తి అనేక ర్యాంపుల నిర్వాహకుల ద్వారా వందలాది మెకనైజ్డ్ బోట్లతో డ్రెడ్జింగ్ చేస్తున్నారు.గాయత్రీ, కాతేరు, కొవ్వూరు వైపు ఈ దందా విపరీతంగా జరుగుతోంది.ఇటీవల కొందరు అధికారుల ఇక్కడ లోపాలను ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్లారు.కానీ ఎవరూ పట్టించుకోవడంలేదు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

భూమి కొలతల్లో తప్పులు సరిచేయాలి



అర్జీదారుల సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ శ్రీవాస్తవ

కొవ్వూరు, మార్చి 4: డివిజనల్ స్పందనలో మూడు ఫిర్యాదులు స్వీకరించినట్టు సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎడ్యుకేషన్ 1, మున్సిపాల్టీ 2 సంబంధించి దరఖాస్తులను స్వీకరించామన్నారు. ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నిడదవోలు మండలంలో రీసర్వే అనంతరం ప్రభుత్వ రికార్డుల్లో తమ భూమి కొలతలలో వ్యత్యాసాలు చూపిస్తున్నారని, తప్పులను సరి చేయాలని రైతులు స్పందనలో ఫిర్యాదుచేశారు. కొవ్వూరులోని రైతులకు వ్యవసాయ అవసరాలకు కుమారదేవం పంపింగ్ స్కీము ద్వారా సాగు నీరందక ఇబ్బందులకు గురౌతున్నామని, నీరందించాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఇన్‌చార్జి పరిపాలనాధికారి కె.రవివిక్రమ్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలి



తాళ్లపూడి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి

కొవ్వూరు/చాగల్లు/తాళ్లపూడి, మార్చి 4: రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడిలో వైసీపీ నాయకులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ఎన్నికల్లో పార్టీ విజయానికి అనుసరించవలసిన విధానాలపై దిశ నిర్దేశం చేశారు. వలంటీర్ల వద్ద ఉన్న సమాచారాన్ని కన్వీనర్లు సేకరించి ఉంచుకోవాలన్నారు. ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ సతీమణి రాధిక మాట్లాడుతూ ఈ 40రోజులు బూత్‌కన్వీనర్లు సేవలందిస్తే అధికారంలోకి వచ్చాక ఐదేళ్ల ప్రజలకు సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, కోడూరి శివరామకృష్ణ, రుత్తల భాస్కరరావు, నగళ్ళపాటి శ్రీనివాస్, ముదునూరి నాగరాజు, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర పాల్గొన్నారు.

ఇంటర్ ఇంగ్లీషు పరీక్షకు 18 మంది గైర్హాజరు

కొవ్వూరు, మార్చి 4: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లీషు పరీక్షలు కొవ్వూరులో ప్రశాంతంగా జరిగాయి. సోమవారం పట్టణ, మండలంలో 506 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా 488 మంది హాజరయ్యారు, 18 మంది గైర్హాజరయ్యారు. కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు 324 మందికి గాను 316 మంది, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 182 మందికి గాను 172 మందికి హాజరయ్యారు.

శ్రీలక్ష్మి శాంతి విద్యానికేతన్ వార్షికోత్సవం

కొవ్వూరు, మార్చి 4: మండలంలోని కుమారదేవంలో శ్రీలక్ష్మి శాంతి విద్యానికేతన్‌లో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు, పాఠశాల వార్షికోత్సవ సభ నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకుడు మల్లిన ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి శశి విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ చిట్టూరి శేషుబాబు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా శేషుబాబుతోపాటు రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల రిటైర్డ్ లెక్చరర్ రాయప్రోలు కామేశ్వరశర్మ, సుంకవల్లి జగన్మోహనరావులను ప్రవీణ్‌కుమార్, రమాదేవి దంపతులు సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

రేపటి నుంచి గోలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



నిడదవోలు, మార్చి 4: నిడదవోలులో శ్రీ రాజ రాజేశ్వరి సహిత గోలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఈ నెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహిం చనున్నట్టు ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు తెలిపారు. బుధవారం రాత్రి స్వామి వారి కల్యాణం, 7న విశేష అభిషేకాలు, 8న మహాశివరాత్రి పూజలు, 9న ప్రత్యేక అభిషేకాలు, 10న పుష్ప యాగోత్సవం జరుగుతాయన్నారు. మహాశివరాత్రి రోజున రుద్రాభిషేకం నిర్వహించనున్నట్టు చెప్పారు.

నేడు జయహో బీసీ సదస్సు

కొవ్వూరు, మార్చి 4: జయహో బీసీ సదస్సును విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి అన్నారు. గుంటూరు జిల్లా కాజాలో మంగళవారం టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో జరగనున్న జయహో బీసీ సదస్సుకు నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు. ఇప్పటికే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని మినీ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టు చెప్పారు.

కుందులకు ప్రముఖుల పరామర్శ

పెరవలి, మార్చి 4: ఇటీవల గుండెకు స్టంట్‌లు వేయించుకున్న టీడీపీ నాయకుడు కుందుల వీరవెంకట సత్యనారాయణను తీపర్రులో సోమవారం ఆయన స్వగృహం వద్ద పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనను పరామర్శించిన వారిలో కుమ్మరి శాలివాహన సంఘ నాయకుడు పసలపూడి భద్రయ్య, దేవిశ్రీ ఫుడ్స్ ఎండీ వెంకటరావు, అనపర్తి వెంకటనారాయణ, గజ్జరపు శ్రీనివాస్, ఎ.శ్రీనివాసరావు, జనసేన నాయకులు ప్రత్తిపాటి ప్రసాద్, తులా చినబాబు, నాని, నాగేశ్వరరావు ఉన్నారు.

ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

చాగల్లు, మార్చి 4: ప్రైవేట్ యాజమాన్యం పాఠశాలలలో వచ్చే విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ఎంఈవో వి.ఖాదర్‌బాబు తెలిపారు. సచివాలయంలో గాని, ఎంఈవో కార్యాలయంలోగాని నమోదు చేసుకోవాలని, వివరాలకు ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం

తాళ్లపూడి, మార్చి 4: మండలంలోని పెద్దేవంలోని జడ్పీ హైస్కూల్లో సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరౌతున్న పదో తరగతి విద్యార్థులకు ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు దంపతులు అల్పాహారం అందించారు. విద్యార్థులందరూ ఉత్తీర్ణులవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేంద్ర, హిందీ టీచర్ జె.పద్మావతి పాల్గొన్నారు.

నూతన వేతన ఒప్పందం అమలు చేయాలి



దుద్దుకూరులో ఆందోళన చేస్తున్న వివిధ కార్మిక సంఘం నాయకులు

దేవరపల్లి, మార్చి 4: మెరుగైన వేతన ఒప్పందం కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలని ప్రగతిశీల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మస్తాన్ అన్నారు. మండలంలోని దుద్దుకూరులో క్వారీ, క్రషర్‌లో పని చేసే లారీ డ్రైవర్ల, హెల్పర్లకు నూతన వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని యజమానులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకోసారి నూతన వేతన ఒప్పందం చేసుకుంటున్నామని, ఈ మేరకు క్వారీ, లారీడ్రైవర్ల, హెల్పర్లకు గత ఫిబ్రవరి 23న నోటీసులు ఇచ్చారన్నారు. మార్చి 9వ తేదీ నాటికి ఒప్పందం గడువు పూర్తవుతుందని, ఇప్పటివరకు యజమానుల నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో ఆందోళన చేపట్టినట్టు మస్తాన్ చెప్పారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు ఆకాష్, సీహెచ్ ఏడుకొండలు, నాగరాజు, సుబ్బారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పట్టిసీమకు ప్రత్యేక బస్సు సర్వీసులు

నిడదవోలు, మార్చి 4: నిడదవోలు ఆర్టీసీ డిపో నుంచి 7వ తేదీ సాయంత్రం 4గంటల నుంచి 8వ తేదీ రాత్రి వరకు పట్టిసీమ క్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామని డిపో మేనేజర్ కె.శ్రీరామ్‌కుమార్ తెలిపారు. అలాగే 30, అంతకన్నా ఎక్కువ మంది ఒక గ్రూపుగా ఏర్పడిన భక్తులకు వారు కోరిన శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్టు చెప్పారు. మరిన్ని వివరాలకు 91009 54632, 73829 05797 నెంబర్లలో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

బ్రహ్మజోస్యులా.. మన్నించు!



సుబ్రహ్మణ్య మైదానంలో సభ జరుగుతుండగానే వెళ్లిపోతున్న మహిళలు

- వైసీపీ రాజకీయ సభకు స్వాతంత్ర్య సమరయోధుల వేదిక
- ఎంపీ సభకు జనం బలవంతంగా తరలింపు
- సచివాలయ సిబ్బందికి హుకుం
- భోజనాల వద్ద కుమ్ములాట
- యథావిధిగా నోరుపారేసుకున్న కొడాలి, పేర్ని

రాజమహేంద్రవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఇక, స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో యోధుల ప్రసంగాలకు మౌన సాక్ష్యం ఆ వేదిక.. రాజమహేంద్రవరం చరిత్రలో ఒక మణిహారం బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం మైదానం.. ప్రస్తుత ఎంపీ భరత్‌రామ్ ఆ వేదిక రూపురేఖలను మార్చేశారు.. చరిత్రను కాల గర్భంలో కలిపేశారు. అయితే సోమవారం పక్క రాజకీయ సభకు వైసీపీ మొట్టమొదటి సారిగా వినియోగించడంతో సుబ్రహ్మణ్యం ఆత్మ మౌనంగా ఘోషించింది. వైసీపీ ఎంపీ, రాజమహేంద్రవరం సిటీ సమన్వయకర్త మార్గాని భరత్‌రామ్ ఎన్నికల శంఖారావమంటూ రాజమహేంద్రవరంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభ 'మా నేత చేలో మేస్తే నేను గట్టున మేస్తానా' అనే తీరుగా సాగింది. సుమారు గంటసేపు జరిగిన ప్రసంగాల్లో పేర్ని నాని, కొడాలి నాని, వైసీపీ నాయకులు టీడీపీని తిట్టడం, జనసైనికులకు ఉచిత సలహాలు ఇవ్వడంతోనే సరిపోయింది. రాజమహేంద్రవరానికి చేయని పనులనూ, ఆర్భాటపు అభివృద్ధిని యథావిధిగా ఎంపీ వల్లెవేశారు. ఈ కార్యక్రమానికి మహిళలను బలవంతంగా తరలించారనే విమర్శలున్నాయి. ఎప్పటి మాదిరిగానే సచివాలయం సిబ్బంది, వలంటీర్లను ఇళ్లకు పంపి సభకు రాకపోతే పథకాలను ఆపేస్తామంటూ బెదిరించి ఆటోల్లో తీసుకొచ్చారని కొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సభ ముగిసిన తర్వాత భోజన ఏర్పాట్లు చేయగా.. అన్నం దొరికితే అదృష్టమే అనే విధంగా జనాలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వృద్ధులు, పిల్లలు పట్టెడన్నం కోసం నలిగిపోయారు. భోజనాల వద్ద తాగునీరు లేక పరుగులు పెట్టారు. ఓ సమయంలో పోలీసులు కూడా నియంత్రించలేనంతగా పరిస్థితి తయారైంది. ఈ రకంగా భోజనాలు ఎవరు పెట్టమన్నారంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. సభకు అనుమతి ఉందో లేదో గానీ పోలీసులను మాత్రం బందోబస్తుకు వాడేశారు.



భోజనం ప్లేట్లతో ఎగబడుతున్న మహిళలు

జగన్.. బటన్ నొక్కుడుతో ప్రజాధనం లూటీ



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో మద్దిపాటి వెంకట్రాజు

- గోపాలపురంలో 'భవిష్యత్‌కు గ్యారంటీ'లో మద్దిపాటి

గోపాలపురం, మార్చి 4: పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం మాటున బటన్ నొక్కుడుతో జగన్మోహనరెడ్డి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. గోపాలపురంలోని రజక, బస్తావారిపేటలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ శంఖారావం కార్యక్రమాలను మండలాధ్యక్షుడు రొంగల సత్యనారాయణ ఆధ్వర్యంలో జ్యేష్ఠ శ్రీధర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రాజు ఇంటింటికీ వెళ్లి బాబూ ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ, మన ఇంటికి మన మద్దిపాటి కరపత్రాలను పంపిణీ చేస్తూ, మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోపాలపురంలో పేదలకు ఇళ్లస్థలాల కేటాయింపులో వైసీపీ నాయకులు చేతివాటం ప్రదర్శించారన్నారు. నియోజకవర్గం ఏర్పడి దశాబ్దాలు దాటుతున్న రజక, బెస్తా ప్రజల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. వర్షపునీటితో ముంపుకు గురవుతున్న ఈ ప్రాంతం రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. ఓటువేసి టీడీపీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వడ్లమూడి రమేష్‌బాబు, నూతంగి దొరబాబు, ఎంపీటీసీ బొర్రా ఆంజనేయులు, భూరెడ్డి వాసు, కె.ప్రసాద్‌బాబు, దాసరి రవి, యంత్రప్రగడ మంగారావు పాల్గొన్నారు. అనంతరం రజక, బెస్తా కులాలకు చెందిన 53 మంది వైసీపీ అభిమానులు టీడీపీలో చేరారు. వారికి మద్దిపాటి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

భావితరాల కోసం చంద్రబాబును సీఎం చేయాలి

- టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి రామకృష్ణారెడ్డి

అనపర్తి, మార్చి 4: భావి తరాల భవిష్యత్ కోసం చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అనపర్తిలోని మార్కండేయపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. రామకృష్ణారెడ్డి ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో కూల్చివేతలు, తాకట్టులు మినహా ప్రజలకు చేకూరిన మేలేమీ లేదని, సంక్షేమ పథకాల పేరిట దోపిడీ జరిగిందని, కోట్లాది రూపాయలను ప్రక్కదారి పట్టించారన్నారు. ఉద్యోగ వర్గాలు, నిరుద్యోగులు పూర్తిగా మోసపోయారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, బాసి, నల్లమిల్లి వెంకటరెడ్డి, కొవ్వూరి పార్వతి, మామిడిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చికాగోలోని టీడీపీ, జనసేన శ్రేణులతో వెబినార్

చికాగోలోని టీడీపీ, జనసేన పార్టీల మిత్రులతో అనపర్తిలోని టీడీపీ కార్యాలయంలో రామకృష్ణారెడ్డి, మర్రెడ్డి శ్రీనివాసరావు వెబినార్ ద్వారా ముచ్చటించారు. చికాగోలోని మిత్రులు తమ కలయికను అభినందించారని, రాష్ట్రంలో టీడీపీ-జనసేన పొత్తు చారిత్రాత్మకమని, వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులు అఖండ మెజారిటీతో విజయం సాధించాలని ఆకాంక్షించినట్టు వారు చెప్పారు.



మార్కండేయపురంలో ఇస్త్రీ చేస్తున్న రామకృష్ణారెడ్డి

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం : నల్లమిల్లి మహాలక్ష్మి

రంగంపేట, మార్చి 4: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి నల్లమిల్లి మహాలక్ష్మి అన్నారు. మండలంలోని చిన దొడ్డిగుంట గ్రామంలో ఆమె పర్యటించి ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల ద్వారా పొందే లబ్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు, కార్యదర్శి పూసల శ్రీనివాస్, టీడీపీ-జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

2050 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

రాజమహేంద్రవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): చాగల్లు మండలంలోని కలవలపల్లిలో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ పక్కన ఖాళీ ప్రదేశంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారంతో విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు అధికారులు సోదాలు చేశారు. 46 బస్తాల్లో నిల్వ ఉంచిన 2050 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన మెట్టపల్లి నరసింహరాజు రామచంద్రాపురం, ఉనకరమిల్లి గ్రామాల్లో రేషన్ బియ్యం కిలో రూ.16 చొప్పున సేకరించి ఇటుక బట్టీలు తదితర చోట్ల పనిచేస్తున్న కూలీలకు రూ.18కి విక్రయిస్తున్నాడని గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.92,375 ఉంటుందని, నరసింహరాజుపై క్రిమినల్ కేసు నమోదుకు సిఫారసు చేశామని ఎస్పీ సుబ్బారెడ్డి తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ అమ్మకం, నిల్వలపై నిఘా పెట్టామని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోదాల్లో విజిలెన్స్ అధికారులు జగన్నాథరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రాజమహేంద్రవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నేరం రుజువు కావడంతో నేరస్తుడికి తొమ్మిదో అదనపు జిల్లా కోర్టు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పింది. పోలీసుల వివరాల ప్రకారం..శాటిలైట్ సిటీలోని డీబ్లాక్‌కి చెందిన బోయిన ముసలయ్య, నీలాల మంగారావు రాడ్‌బెండింగ్ పనికి వెళ్లేవారు. వాళ్లతో ముసలయ్య అన్న దుర్గారావు కూడా వెళ్లేవాడు. అయితే దుర్గారావుతో మంగారావు మందు తాగించి పాడుచేస్తున్నాడని దుర్గారావు తండ్రి మంగారావును మందలించాడు. ఈ క్రమంలో 2019 ఫిబ్రవరి 25న గొడవ జరిగింది. దీంతో మంగారావుపై ముసలయ్య కక్ష పెంచుకున్నాడు. మరుసటి రోజు ఉదయం పనికి వెళదామంటూ మంగారావును ముసలయ్య కల్లు దుకాణానికి తీసుకెళ్లి బాగా తాగించాడు. ఇంటికి తీసుకెళతానని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని కవలగొయ్యి వెళ్లే దారిలో ఓ తోట వద్ద మంగారావును కిందపడేసి ముఖంపై బండరాయితో కొట్టి చంపేశాడు. దీనిపై అప్పటి బొమ్మూరు సీఐ కె.దామోదర్‌రావు కేసు నమోదు చేశారు. బోయిన ముసలయ్యపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంఏ బాషా, కోర్టు విచారణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన బొమ్మూరు సీఐ ఎండీ ఉమర్ తదితరులను ఎస్పీ జగదీశ్ అభినందించారు. ట్రైల్ కేసుల ప్రత్యేక పర్యవేక్షణ ఫలితాలనిస్తోందని ఆయన అన్నారు.

నేటి నుంచి లక్ష్మీసుదర్శన యాగం

కోరుకొండ, మార్చి 4: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో 3 రోజులపాటు శ్రీఅష్టముఖ గండభేరుండ లక్ష్మీసుదర్శన యాగం నిర్వహిస్తున్నట్టు వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. సోమవారం సాయంత్రం స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ యాగ కార్యక్రమాలు 5,6,7 తేదీల్లో జరుగుతాయన్నారు. కాగా ఈ యాగానికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు సోమవారం అంకురార్పణ చేశారు. కార్యక్రమంలో గంధం నారాయణరావు, తాడి హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి, బొరుసు బద్రి, వాకా నరసింహారావు, పసుపులేటి బుల్లియ్యనాయుడు, కేతినీడి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్ఆర్ బ్రిడ్జిపై ఎక్స్‌ప్రెస్ బస్సులను అనుమతించాలి



కొవ్వూరు సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొవ్వూరు, మార్చి 4: ప్రజా సమస్యలు పరిష్కరించి ఆర్టీసీ బస్సులు కొవ్వూరు పట్టణంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సోమవారం బీజేపీ నాయకులు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పరిమి రాధా మాట్లాడుతూ రోడ్డు కం రైలు బ్రిడ్జిపై మరమ్మతుల పేరుతో రాకపోకలు నిలుపుదల చేశారని, వంతెనపై శాశ్వత మరమ్మత్తులు చేపట్టకుండా కేవలం రోడ్డు నిర్మాణం చేపట్టి, ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను బ్రిడ్జిపై నిషేధించడంతో కొవ్వూరు పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు దూర ప్రయాణాలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మేరకు రోడ్ కం రైలు బ్రిడ్జిపై బస్‌లు వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, పట్టణాధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు, గెల్లా కేశవ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో తుంటి మార్పిడి శస్త్ర చికిత్స

వైద్యులను సత్కరించిన ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి, మార్చి 4: అనపర్తి ఏరియా ఆసుపత్రిలో రోగికి తుంటి మార్పిడి శస్త్ర చికిత్సను వైద్యులు విజయంతంగా నిర్వహించారు. అనపర్తికి చెందిన శేఖర్‌కు తుంటి మార్పిడి అవసరమని గుర్తించిన వైద్యులు, ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్స నిర్వహిస్తామని చెప్పారు. దీంతో అతడు శస్త్ర చికిత్స చేయించుకునేందుకు ముందుకు రావడంతో ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి ఆధ్వర్యంలో నిపుణుల బృందం ఇటీవల శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్థోపెడిక్ వైద్యుడు ప్రదీప్‌సుందర్, ఎనస్థీసియా డాక్టర్ రజనిలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనపర్తి ఏరియా ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులున్నారని, వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. తుంటి మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహింఇన వైద్యులను అభినందించారు. కార్యక్రమంలో వైద్యులు తరుణ్, వర్మ, సునీత, సునీల్‌రాజ్, డేవిడ్, వాణి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బాల, ఉమా శంకర్, గుంటూరు శ్రీను, ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రతి ఓటు ఎంతో కీలకం

కోరుకొండ, మార్చి 4: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటు ఎంతో కీలకమైందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ ఎమ్మెల్యే కార్యాలయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారధులు, బూత్‌కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా పని చేయాలన్నారు. కష్టపడి పని చేసేవారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. బీజేపీ, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పేదలకు ఒక్క అంగుళం భూమి కూడా కేటాయించలేదని, వైసీపీ పాలనలో నియోజకవర్గంలో 25,182 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించామన్నారు. సమావేశంలో జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, నక్కా రాంబాబు, కడియాల పాపారావు, గంధం నారాయణరావు, తిరుమల సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే వ్యాపార లక్షణాలు అలవర్చుకోవాలి

జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు



సర్టిఫికెట్లు చూపుతున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 4: ఉత్తమ వ్యాపార లక్షణాలను విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు అన్నారు. బొమ్మూరు జిల్లా ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం జిల్లా స్థాయి ఎక్స్‌పో 2023-24 పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఆర్థిక అవసరాలను తీర్చే ప్రయత్నం చేయాలన్నారు. ఈ పోటీలకు 11 పాఠశాలల నుంచి 55 మంది విద్యార్థులు, 10 మంది గైడ్ టీచర్లు భాగస్వామ్యం వహించారు. జిల్లాలో ఉన్న పాఠశాలల నుంచి 95 ప్రాజెక్టు వర్కులు సమర్పించారన్నారు. వీటిలో 11 ప్రాజెక్టులు డైట్ కళాశాలకు రావడం అభినందనీయమన్నారు. జిల్లా నుంచి వచ్చిన ప్రాజెక్టులను పరిశీలన చేసి 2 ప్రాజెక్టులను ఎంపిక చేశామని సైన్సు ప్రాజెక్టు అధికారి నెహ్రూ తెలిపారు. కార్యక్రమంలో డీవైఈవో నారాయణ, డైట్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, జిల్లామేనేజర్ ఎం.వెంకటరమణ, సుభాషిణి పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ

దివాన్‌చెరువు, మార్చి 4: నన్నయ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 విద్యార్థులు సోమవారం దివాన్‌చెరువులో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానికంగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా నాలుగో రోజున ఓటర్ల చైతన్య కార్యక్రమం జరిగింది. పీవో ఎస్.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. అంతకుముందు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ పర్యావరణానికి హాని చేస్తుందని, ప్లాస్టిక్ కవర్‌లకు బదులు క్లాత్ బ్యాగ్‌లు, గోనెసంచులు వినియోగించడం ఉత్తమమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సునీత, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ ఉపకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

గోకవరం, మార్చి 4: ప్రజల అవసరార్థం ఏర్పాటుచేసిన విద్యుత్ ఉపకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని కొత్తపల్లి సమీపంలో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ఉపకేంద్రం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జనపరెడ్డి సుబ్బారావు, దాసరి రమేష్, వరసాల ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ధవళేశ్వరం, మార్చి 4: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. డ్రీమ్స్ స్కూల్లో నిర్వహించిన క్రీడోత్సవం-2024 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఒత్తిడి దూరమై మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎ.రమేష్, ప్రిన్సిపాల్ వి.సంధ్యాకుమారి పాల్గొన్నారు.

ఒకటో తరగతిలో ప్రవేశానికి అడ్మిషన్లు

కడియం, మార్చి 4: విద్యాహక్కుచట్టం-2009 ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ, ప్రైవేటు మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశానికి ఈనెల 5వ తేదీ నుంచి 25 తేదీ వరకు అడ్మిషన్లు స్వీకరించనున్నట్టు ఎంఈవోలు ఎంఎస్ మణికుమార్, వై.నాగేశ్వరరావులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అడ్మిషన్లలో వివిధ వర్గాలకు చెందిన చిన్నారులకు రిజర్వేషన్ల ప్రకారం 25శాతం సీట్లు కేటాయిస్తారని, సంబంధిత పోర్టల్ ద్వారా అడ్మిషన్ల పొందవచ్చన్నారు. అడ్మిషన్లు పొందగోరు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ సచివాలయం, ఎంఈవో కార్యాలయం, నెట్ సెంటర్లలో నమోదు చేసుకోవచ్చన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

కడియం, మార్చి 4: మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం సోమవారం కడియపులంకలోని బైబిల్ మిషన్ రారాజు మందిరంలో జరిగింది. పాస్టర్ జీవరత్నం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కోటికేశవరం నుంచి విచ్చేసిన రెవ. రాజు జోషియా వాక్య సందేశం అందించారు. ప్రెసిడెంట్ ఎం.కరుణాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పరంజ్యోతి, వైస్ ప్రెసిడెంట్ ప్రసన్నకుమార్, గౌరవాధ్యక్షుడు కె.జయశీల్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 4 ఫిర్యాదులు

రంగంపేట, మార్చి 4: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 4 ఫిర్యాదులు అందాయని డిప్యూటీ తహశీల్దార్ ఎస్.దొరకయ్య తెలిపారు. రంగంపేట దేవి సెంటర్‌లో చెరువుగట్టును ఆక్రమించుకొని నిర్మించిన షెడ్‌ను తొలగించాలని, స్థానిక నల్లచెరువు గట్టు పక్కన ఇళ్ల స్థలాలు కేటాయించ వద్దని, గ్రామంలో సర్వే నెంబర్ 219లో ఎకరా 8 సెంట్లు భూమి అన్యాక్రాంతమైనదని, దానిని విడిపించాలని మాజీ సర్పంచ్ మేడిశెట్టి రవిశంఖర్ స్పందనలో ఫిర్యాదు చేశారన్నారు. రంగంపేట పీహెచ్‌సీలో కనీస సౌకర్యాలు కల్పించాలని వార్డు మెంబర్ పీవీవీ సత్యనారాయణ ఫిర్యాదు అందించారన్నారు. గ్రామంలోని గండేపల్లి రోడ్డులో ఉన్న మంచినీటి బోరును మరమ్మతు చేయించాలని ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు ఫిర్యాదు చేసినట్టు డీటీ దొరకయ్య తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 667 మంది హాజరు

రంగంపేట, మార్చి 4: రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన ఇంటర్ ఫస్టియర్ ఇంగ్లీషు పరీక్షకు 692మంది 667 మంది విద్యార్థులు హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్, ఆర్ఐవో నరసింహం పరిశీలించారన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఘన వీడ్కోలు

దేవరపల్లి, మార్చి 4: దేవరపల్లి భాష్యం స్కూల్లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భాష్యం జోనల్ ఇన్‌ఛార్జ్ సత్యనారాయణ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించే విధంగా నిరంతరం విద్యపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పేరయ్యనాయుడు, ఛాంప్స్ ప్రిన్సిపాల్ సబాన, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1: సిద్ధార్థ్‌రాయ్
వై.స్క్రీన్2 : ఈగల్
దేవిశ్రీ(గాయత్రి) : హనుమాన్
అనన్య : ఊరి పేరు భైరవ కోన

నిడదవోలు
వీ మ్యాక్స్ : ఊరి పేరు భైరవ కోన
రాధాకృష్ణ : ఆపరేషన్ వాలంటైన్
శ్రీగణపతి : వ్యూహం

దేవరపల్లి
శ్రీరామ్ సినీ మ్యాక్స్ : గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్ : గుంటూరు కారం

నల్లజర్ల
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ : సలార్
శ్రీనివాస : సలార్